షణ్ముఖ

# వెలుగు

ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక

RNI : APTEL / 2023 / 89152

1 YEAR HAPPY WORK ANNIVERSARY...

సంపుటి : 2 సంచిక : 10 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ మంగళవారం 19 నవంబర్ 2024 పేజీలు 8 : వెల 5/- ఒంగోలు

VOLUME : 02 ISSUE : 9 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Tuesday 19 Novmbar 2024 PAGES : 8 PRICE : 5/-

## మరాఠీ గడ్డపై జనసునామి సృష్టించిన

# 'పవన్' క్రేజ్



### ఎన్డీఏ కూటమి అంచనాలకు మించిన జన స్పందన
### రెండ్రోజుల మహారాష్ట్ర ఎన్నికల టూర్ సక్సెస్
### సనాతన ధర్మ పరిరక్షణపై మరాఠీల్ని ఆలోచింపజేసిన 'జనసేనాని' వ్యాఖ్యలు
### బహిరంగ సభల్లో తూటాల్లా పేలిన 'పవన్' పంచ్ లపై దేశవ్యాప్త చర్చ

**అమరావతి:**

మహారాష్ట్ర మరాఠీ గడ్డపై 'జనసేనాని' అడుగు రాజకీయ ప్రకంపనలు పుట్టించింది. ఆ రాష్ట్ర రాజకీయ వాతావరణంలో ముందెన్నడూ చూడని జన సునామి కనిపించింది. బీజేపీ పెద్దలు, ప్రధాని నరేంద్ర మోదీ అన్నట్టు పవన్ కళ్యాణ్ అనే వ్యక్తి తెలుగు తుఫాన్ అని మరోసారి నిరూపించుకున్నారు. ఏపీ నుంచి ఎన్డీఏ కూటమి తరఫున ఎన్నికల ప్రచారానికి వెళ్ళిన జనసేన అధినేత కొణిదెల పవన్ కళ్యాణ్ క్రేజ్ బీజేపీ కూటమికి హైప్ నిచ్చింది. ఆయన రెండ్రోజుల ఎన్నికల పర్యటన బీజేపీ కూటమికి భారీ ప్లస్ కానున్నది. బీజేపీని కలుపుకొని కూటమిగా ఏర్పడిన టీడీపీ, జనసేన.. ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో టాప్ లేపిన సంగతి ఇప్పటికే అందరికీ తెలిసిందే. అద్భుతమైన మెజారిటీతో సర్కార్ ఏర్పాటు చేసింది. పొత్తులో ఉన్న పార్టీలుగా.. ఒకరికి ఒకరం సహకారం అందించుకోవాలి అన్నట్లుగా.. బీజేపీ పెద్దల అభ్యర్థనను గౌరవించిన పవన్ కళ్యాణ్ మహారాష్ట్రలోని తెలుగు ప్రాంతాల్లో రెండ్రోజులపాటు ప్రచారం చేశారు.

**మరట్వాడా, విదర్భ, పశ్చిమ రీజియన్లలో జనసునామి..:**

మహారాష్ట్రలో రెండురోజుల పాటు.. 5 సభలు, 2 రోడ్‌షోలలో పవన్ కళ్యాణ్ పాల్గొన్నారు. మరట్వాడా, విదర్భ, పశ్చిమ మహారాష్ట్ర రీజియన్లలో.. ఎన్డీఏ మహాయుతి అభ్యర్థుల తరఫున ఆయన ప్రచారం చేశారు. 16న నాందేడ్ జిల్లా డెగ్లూర్ నియోజకవర్గం బహిరంగ సభలో పాల్గొన్న పవన్ కళ్యాణ్.. తర్వాత అదే జిల్లాలోని భోకర్ నియోజకవర్గంలో.. ఆ తర్వాత లాతూర్‌లో జరిగే మరో బహిరంగ సభకు హాజరయ్యారు. అదే రోజు రాత్రి షోలాపూర్ సిటీలో రోడ్‌షోలో పాల్గొన్నారు. 17న విదర్భ ప్రాంతం, చంద్రపూర్ జిల్లాలోని బల్లార్‌పూర్‌లో బహిరంగ సభలో పవన్ కళ్యాణ్ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. పుణె కంటోన్మెంట్ నియోజకవర్గం పరిధిలో రోడ్ షోలో.. అక్కడి నుంచి కస్బాపేట్ నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారసభలో పాల్గొన్నారు.

**మిన్నంటిన తెలుగు ప్రజల ఆదరణ:**

మహారాష్ట్రలో తెలుగు ప్రజలతో పాటు మరాఠీలు పవన్ కళ్యాణ్ పర్యటనకు అడుగడుగునా బ్రహ్మరథం పట్టారు. మహాయుతి కూటమి ఫ్లెక్సీల్లో ఆంధ్రా డిప్యూటీ సీఎం, జనసేనాని ఫోటోలకు ప్రాధాన్యతనిచ్చి వాడుకున్నారు. సభల్లో పవన్ ప్రసంగాన్ని ఆసాంతం శ్రద్ధగా ఆలకించారు. గతంలోనూ కర్ణాటకలో బీజేపీ కోసం పవన్ కళ్యాణ్ ప్రచారం చేశారు. వారు పర్యటించిన ప్రాంతాల్లో తెలుగు వాళ్లు ఎక్కువగా ఉన్నారు. పైగా పవన్ క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. దీంతో పవన్ సభలతో అక్కడ ఓట్లు మరింతగా పెరిగే అవకాశాలు తప్పకుండా ఉంటాయి. గతంలో తెలంగాణలోనూ ఎన్డీఏకు అనుకూలంగా పవన్ కళ్యాణ్ ప్రచారం చేశారు.

**ఆకట్టుకున్న 'పవన్' ప్రసంగాలు:**

"నేను నా పిల్లలు ఇద్దరితో మరాఠీలో మాట్లాడుతాను. భాష మీద గౌరవంతో నేర్చుకున్నాను. విదేశీ భాషలు నేర్చుకునే మనం, మన సరిహద్దు రాష్ట్రాల భాషలు నేర్చుకోవాలి కదా. కనీసం 5 ప్రాంతీయ భాషలు నేర్చుకోవాలి. మన భాష, సంస్కృతిని నేర్చుకోవాలి" అని పవన్ కళ్యాణ్ చెప్పారు. "నేను ఆంధ్రలో మార్పు తీసుకొచ్చి చూపించాను, వైసీపీని ఓడించలేరు అంటే ఓడించి చూపించాను. ఇప్పుడు మీరు కూడా ఎన్డీఏ ప్రభుత్వాన్ని గెలిపించడానికి సిద్ధం కావాలి. మహారాష్ట్ర అభివృద్ధి చెందాలన్నా, బల్లార్పూరు అభివృద్ధి చెందాలన్నా, లక్ష కోట్ల ఆర్థిక వ్యవస్థగా మహారాష్ట్ర ఎదగాలంటే ఎన్డీఏ కూటమి అభ్యర్థిని గెలిపించండి, ఓట్లు వేయండి, రోడ్లు మీదకు రావాలి" అని పవన్ కళ్యాణ్ అన్నారు. "భారత్ 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మారాలంటే మహారాష్ట్ర లక్ష కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చెందాలి. నూతనంగా నిర్మించిన పార్లమెంట్ భవనంలో తమిళనాడు సంస్కృతిని ప్రతిబింబించే సెంగోల్ ఏర్పాటు చేశారు. కేంద్ర ప్రభుత్వం మహారాష్ట్ర అభివృద్ధి కోసం అనేక ప్రత్యేక చర్యలు తీసుకుంది. ఈ ఎన్నికల్లో రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వాన్ని స్థాపించేందుకు మీరు అందరూ ఓటు - మిగతా3లో



## మణిపూర్‌కు మరో 50 సీఆర్‌పీఎఫ్ కంపెనీలు

- ఈశాన్య రాష్ట్రంలో తీవ్ర ఉద్రిక్తతలు
- రాష్ట్రంలో భద్రతను మరింత పటిష్టం చేయాలని హోం శాఖ నిర్ణయం
- శాంతి భద్రతల పరిరక్షణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సీఆర్‌పీఎఫ్, రాష్ట్ర పోలీసు అధికారులకు ఆదేశాలు
- మణిపూర్‌కు అదనంగా 50 కంపెనీల సీఆర్‌పీఎఫ్ బలగాలను పంపించాలని కేంద్రం నిర్ణయం

# ఇదేం పద్ధతి

- అయ్యన్న పాత్రుడు సీరియస్
- తప్పుడు నివేదికలు ఇచ్చిన అధికారులపై చర్యలు తీసుకోండి
- అయ్యన్నపాత్రుడు ఆదేశం
- జగనన్న కాలనీలపై అసెంబ్లీలో చర్చ
- అధికారులు ఇస్తున్న నివేదికలకు, వాస్తవాలకు మధ్య తేడా ఉందన్న అయ్యన్న
- జగనన్న కాలనీలపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టాలని ఆదేశం



**అమరావతి**

ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు సోమవారం ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యాయి. ప్రశ్నోత్తరాల సమయం కొనసాగుతోంది. అయితే సభలో ఏపీ అసెంబ్లీ స్పీకర్ అయ్యన్న పాత్రుడు సీరియస్ కామెంట్స్ చేశారు. జగనన్న కాలనీల్లో పూర్తి స్థాయి విచారణ చేపట్టాలని కోరారు. అధికారుల నివేదికలకు వాస్తవ పరిస్థితులకు చాలా తేడా ఉందని అన్నారు. తప్పుడు నివేదికలు ఇచ్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలని స్పీకర్ ఆదేశించారు. ఒక అధికారిపై చర్యలు చేపడితే మిగిలిన అధికారులు ఇలా చేయరని.. అధికారులు ఇలాంటి పద్ధతులు వెంటనే మానుకోవాలని ఏపీ అసెంబ్లీ స్పీకర్ అయ్యన్న పాత్రుడు హెచ్చరించారు. అధికారులు ఇస్తున్న నివేదికలకు, వాస్తవ పరిస్థితులకు మధ్య చాలా తేడా ఉందని ఆయన అన్నారు. తప్పుడు నివేదికలు ఇచ్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఒక అధికారిపై చర్యలు తీసుకుంటే మిగిలిన అధికారులు అలా చేయరని అన్నారు. - మిగతా3లో



## వైసీపీ ప్రభుత్వ పాలనలో

# చాలా లోపాలున్నాయి

- మహిళల అత్యాచారాలపై అసెంబ్లీలో వాడివేడి చర్చ..
- వైసీపీ ఎమ్మెల్సీలకు అనిత మాస్ వార్నింగ్
- మహిళలపై దాడులు, హత్యలు, అత్యాచారాలు పెరిగిపోయాయి
- కేంద్ర ప్రభుత్వం నిధులిచ్చిన అమరావతిలో ఫోరెన్సిక్ ల్యాబ్ ఎందుకు నిర్మించలేదు

**అమరావతి**

ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు సోమవారం ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యాయి. ప్రశ్నోత్తరాల సమయం కొనసాగుతోంది. అయితే శాసన మండలిలో మహిళల అత్యాచారాలపై వాడివేడి చర్చ జరిగింది. ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యుల మధ్య వాగ్వాదం మొదలైంది. ఈ విషయంపై హోంమంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ.. ఏపీలో జగన్ ప్రభుత్వం కంటే ఈ ఐదు నెలల్ కూటమి ప్రభుత్వంలో క్రైమ్ రేటు చాలా తగ్గిందని మంత్రి అనిత స్పష్టం చేశారు. మహిళలపై దాడులు, హత్యలు, అత్యాచారాలు పెరిగిపోయాయని వైసీపీ ఎమ్మెల్సీ వరుదు కల్యాణి ప్రశ్నించారు. దిశ చట్టం తీసుకొస్తారా, దిశ యాప్ - మిగతా3లో

# మరాఠీ గడ్డపై జనసునామి సృష్టించిన 'పవన్' క్రేజ్

-మొదటిపేజీ తరువాయి

వేయాలి అని కోరుతున్నాను" అని చెప్పారు.

"500 సంవత్సరాల ఎదురుచూపులు తరవాత మనకు అయోధ్య రామ జన్మభూమి లో రామ్ లల్లా విగ్రహం ప్రతిష్ఠ జరిగింది. మన బలార్ష ప్రజల అదృష్టం ఆ ఆలయానికి తలుపులు ఇక్కడ టేకుతో తయారు అయ్యాయి" అని తెలిపారు.

"జనసేన పార్టీని బలంగా తీసుకెళ్లడంలో మహారాష్ట్ర స్ఫూర్తి కూడా ఉంది. ఒకరు ఛత్రపతి శివాజీ గారు, ఇంకొకరు హిందూ హృదయ్ సామ్రాట్ శ్రీ బాలసాహెబ్ ఠాక్రే గారు. బలాసాహెబ్ ఠాక్రే గారి పుణ్య తిథి సందర్భంగా ఆయనకు నివాళి అర్పిస్తున్నాను" అని పవన్ చెప్పిన తీరు అక్కడ ప్రజలను తీవ్రంగా ఆకట్టుకుంది.

**ధర్మపరిరక్షణకు ఎన్డీఏను ఎన్నుకోవాలనడంపై దేశవ్యాప్త చర్చ:**

సనాతన ధర్మ పరిరక్షణపై పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలు.. తీసుకున్న చర్యలు ఇప్పటికే దేశవ్యాప్తంగా చర్చకు దారి తీశాయి. ఇప్పుడు మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో భాగంగా వారి వ్యాఖ్యలు తీవ్రంగా ప్రభావం చూపనున్నాయి.

– బీజేపీ అంటే మతతత్వ పార్టీ కాదని, మానవత్వ పార్టీ అని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు.

– బంగ్లాదేశ్, పాకిస్థాన్‌లో హిందువులకు రక్షణ లేదు. భారత్‌లో ఇతర మతాల హీరోలనూ అభిమానిస్తారు. దేశ రక్షణ బీజేపీతోనే సాధ్యం.. ఆ పార్టీని గెలిపించండి అని జనసేనాని పవన్ కళ్యాణ్ పిలుపునిచ్చారు. లాతూర్‌లో బీజేపీ అభ్యర్థి అర్చన పాటిల్, నాందేడ్ జిల్లా భోకర్ నియోజకవర్గం అభ్యర్థి శ్రీజయ చవాన్ కోసం ఎన్నికల ప్రచారం చేశారు. లాతూర్‌లో నిర్వహించిన ర్యాలీలో ప్రజలు భారీగా పాల్గొన్నారు. నాందేడ్ జిల్లా బీజేపీ అభ్యర్థుల తరపున నిర్వహించిన బహిరంగ సభలో పవన్ మాట్లాడారు. సబ్‌కా సాత్ సబ్‌కా వికాస్, సనాతన ధర్మం, దేశ రక్షణ బీజేపీతోనే సాధ్యమని, ఆ పార్టీని గెలిపించాలని కోరారు. మహారాష్ట్రలో సనాతన ధర్మ రక్షణ కోసం ఛత్రపతి శివాజీ, శివసేన వ్యవస్థాపకుడు బాల్‌థాక్రే చేసిన సేవలను కొనియాడారు. ప్రధాని మోదీ నాయకత్వంలో జరిగిన అభివృద్ధిని చూడాలన్నారు. ఆర్టికల్ 370 రద్దు, దేశ ప్రజల కల అయోధ్య రామమందిర నిర్మాణాన్ని నెరవేర్చారని అన్నారు. 30 కోట్లమంది గ్రామీణ మహిళలకు జనధన్ యోజన బ్యాంకు ఖాతాలను తెరిపించి స్వయం ఉపాధి కల్పిస్తున్నారని పేర్కొన్నారు. 12 కోట్ల మంది రైతులకు పీఎం కిసాన్ పథకాన్ని వర్తింపజేశారని తెలిపారు. పాలాజ్ సత్యగణేష్ ఆలయంలో పవన్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్థులతో మాట్లాడి.. ఆలయ చరిత్రను అడిగి తెలుసుకున్నారు. కాగా, బహిరంగ సభలో అభిమానులు కేకలు వేయడంతో "మీరంతా సరిహద్దు తెలంగాణ వాసులని అర్థమైంది"అని పవన్ అన్నారు. తెలంగాణ ఉద్యమ గడ్డ అని కొనియాడుతూ.. బండెనుక బండి గట్టి పదహారు బండ్లు గట్టి అనే పాటను పాడారు.

**మహారాష్ట్ర కర్మభూమిగా పేర్కొంటూ..:**

మహారాష్ట్ర నేల సంస్కృతి, సంప్రదాయాల కలబోతని, ఛత్రపతి శివాజీ మహారాజ్ తన పోరాట పౌరుషం నింపిన గడ్డ అని పవన్ అన్నారు. డా.బీ.ఆర్ అంబేడ్కర్ లాంటి మహనీయులను దేశానికి అందించిన గడ్డ మహారాష్ట్ర అని.. కర్మభూమి అయిన మహారాష్ట్ర దేశానికి ఓ స్ఫూర్తి మంత్రమని పేర్కొన్నారు. పోరాటంలో ముందుండే మరాఠా ప్రజలను కలుసుకోవడం గౌరవంగా భావిస్తున్నానని చెప్పారు. జీవితంలో పదవులు ముఖ్యం కాదని... జాతి, దేశం కోసం పాటుపడే ఆలోచన అత్యుత్తమని నమ్మే బాల్‌థాక్రే సిద్ధాంతాలు తనకు స్ఫూర్తి అని చెప్పారు. అంత స్థాయిలో సూటిగా పవన్ కళ్యాణ్ అలా పిలుపునివ్వడంపై మరాఠీల మదిలో కొత్త ఆలోచనలు రేకెత్తించాయని చెప్పొచ్చు. ఏదేమైనప్పటికీ.. పవన్ కళ్యాణ్ క్రేజ్ ను వాడుకుని ఎన్నికల్లో లాభపడేందుకు ఎన్డీఏ కూటమి చేసిన కసరత్తు అద్భుతమైన ఫలితాలు తెచ్చిపెట్టనున్నాయనడంలో సందేహమేలేదు. ఈ విషయంపై మహారాష్ట్ర తెలుగు ప్రజలే కాకుండా ఇక్కడున్న ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రజలు సైతం చాలా ఆసక్తి, ఉత్కంఠతో ఎదురు చూస్తున్నారు.

# ఏపీలో హిట్లర్, గడాఫి కలిసి పాలన చేస్తున్నట్లు ఉంది

**నియంతలే కాలగర్భంలో కలిసిపోయారు.. మీరెంత**

**కూటమికి రోజా హెచ్చరిక**

**తప్పు చేయని తమ పార్టీ సోషల్ మీడియా యాక్టివిస్టులపై కేసులు పెడుతూ వేధిస్తున్నారు**

**తమ పార్టీ నేతలు, మహిళలను కించపరిచేలా కొంత మంది తప్పుడు ప్రచారం చేస్తున్నారు**



**అమరావతి :** రాష్ట్రంలో నియంత పాలన కొనసాగుతుందని వైసీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమంగా కేసులు పెట్టడం దారుణమని వైసీపీ నాయకులు ఆరోపించారు. చరిత్రలో నియంతలు కాలగర్భంలో కలిసిపోయారని, మీరెంత అంటూ కూటమి నాయకులను హెచ్చరించారు.

వైసీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు మానుకోవాలని, సోషల్ మీడియాలో అసభ్యకరంగా పోస్టులు పెట్టిన ఐటీడీపీపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మాజీ మంత్రి ఆర్‌కె రోజా మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి, తదితరులు సోమవారం తిరుపతి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా రోజా మీడియాతో మాట్లాడారు.

పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు వెళితే కనీస స్పందన లేదని విమర్శించారు. ఫిర్యాదు రిసిప్ట్ కూడా ఇవ్వడం లేదని ఆరోపించారు. పోలీసు వ్యవస్థ కూటమికి సెల్యూట్ కొడుతుందని, మీ నెత్తి మీద ఉన్న టోపీ మీద ఉన్న ఆ మూడు సింహాలకి సెల్యూట్ కొట్టి న్యాయంగా పనిచేయాలని సూచించారు. పోలీసులు ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవద్దని, ప్రజలు తిరగబడే రోజులు వస్తాయని వెల్లడించారు. తప్పులు చేసి తప్పించుకోవడంలో, వ్యక్తిత్వ హననంలో చంద్రబాబు సిద్ధహస్తుడని విమర్శించారు. వైసీపీ నాయకులను, కార్యకర్తలను భయభ్రాంతులను చేయడానికి ఫేక్ ఐడీలు సృష్టించి తప్పుడు కేసులు బనాయిస్తున్నారని అన్నారు. వైసీపీకి పోరాటాలు కొత్త కాదని , ప్రభుత్వం తప్పుడు విధానాలకు పాల్పడితే చరిత్రహీనులుగా మిగిలిపోతున్నారని విమర్శించారు. ఐదు నెలల కాలంలో సుమారు 7,200 మంది ట్రాఫికింగ్ జరిగిందని పేర్కొన్నారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్ పాలన చూస్తుంటే హిట్లర్, గధాపి పాలన గుర్తొస్తుందని ఆరోపించారు. "వైసీపీ అధినేత జగన్, ఆయన సతీమణి భారతిపై సోషల్ మీడియాలో నీచాతినీచంగా పోస్టులు పెడుతున్నారు. ఫిర్యాదు చేసేందుకు వస్తే ఫిర్యాదు స్వీకరించినట్లు రసీదు ఇవ్వటానికి పోలీసులు నానా హైరానా పడుతున్నారు. కూటమిలోని మూడు పార్టీలకు పోలీసులు సెల్యూట్ చేయవద్దు, మూడు సింహాలకు సెల్యూట్ కొట్టి న్యాయం చేయండి. ఏపీలో హిట్లర్, గడాఫి కలిసి పాలన చేస్తున్నట్లు పరిస్థితులు ఉన్నాయి. పెద్దపెద్ద నియంతలే కాలగర్భంలో కలిసిపోయారు. వైసీపీ హయాంలో ఐటీడీపీ నీచపు పోస్టులు పెట్టింది. ప్రస్తుతం ఏ తప్పూ చేయని వారిపై కేసులు పెడుతూ వేధిస్తున్నారు. వైసీపీ సోషల్ మీడియా యాక్టివిస్టులపై పోలీసులు దాడులు చేస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. వైసీపీ ప్రభుత్వంలో వేల మంది మహిళలు, యువతీయువకులు అదృశ్యమయ్యారని తప్పుడు ప్రచారం చేశారు. అసెంబ్లీ వేదికగా నిజనిజాలు బయటకు వచ్చాయి. 36 మందే అదృశ్యమైనట్లు అసెంబ్లీ సాక్షిగా హోంమంత్రి వంగలపూడి అనిత ప్రకటించారు. మరి మీ పాలనలో అదృశ్యమైన మహిళల ఆచూకీ కోసం ఎన్డీయే ప్రభుత్వం తీసుకున్న చర్యలేంటో ప్రజలకు వెల్లడించాలి. ఆంధ్రప్రదేశ్‌లో సీఎం చంద్రబాబు నాయుడు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారు. తప్పు చేయని వారిపై కేసులు మోపుతూ వ్యక్తిత్వ హననానికి ఆయన పాల్పడుతున్నారు. వారు తప్పు చేస్తూ ఎదువారిపై నిందలు మోపే ప్రయత్నం చేస్తున్నారు. మహిళలపై సోషల్ మీడియా వేదికగా కొంతమంది నీచంగా పోస్టులు పెడుతున్నారు. మా పార్టీ నేతలనూ వారు వదిలిపెట్టడం లేదు. మేము ఫిర్యాదు చేసి కంప్లైట్ కాపీని అడిగితే పోలీసులు వందసార్లు ఆలోచించారు. ఒక్క కాపీ ఇచ్చేందుకు మీనమేషాలు లెక్కపెడుతూ ఉన్నతాధికారులతో మాట్లాడుతున్నారు. కూటమి ప్రభుత్వానికి కాదు.. మీ టోపీపై ఉన్న మూడు సింహాలకు సెల్యూట్ చేయండి" అంటూ మండిపడ్డారు.

# జగన్‌కు దూరమవుతున్న ఫ్యామిలీ, పొలిటికల్ ఫ్రెండ్స్



**కడప :** పవర్‌లో ఉన్నప్పుడు అంతా బానే ఉంటుంది. అందరూ దగ్గరి వాళ్లలాగే బిహేవ్ చేస్తుంటారు. పవర్‌పోతేనే తెలుస్తుంది. దగ్గరి వాళ్లు ఎవరు.? అవసరపూర్తి కోసం వచ్చినోళ్లు ఎవరని? వైసీపీ అధినేత జగన్‌కు ఇప్పుడు ఇదే సీన్ కనిపిస్తోందట. అధికారంలో ఉన్నప్పుడు దగ్గరగా ఉన్నవాళ్లంతా ఇప్పుడు ఎవరి దారి వాళ్లు చూసుకుంటున్నారు. ఫ్యాన్ గాలి పడటం లేదంటూ..సైకిల్ సవారీకి సై అంటున్నారు. పైకి పోతేపోనీ అంటున్న వైసీపీ అధినేత..లోలోపట మాత్రం ఇంత చేస్తే ఇలా హ్యాండిస్తారా అంటూ మధన పడుతున్నారట. జగన్ వెంట నడుస్తాం. రాజన్న రాజ్యమే లక్ష్యమని చెప్పుకున్న వాళ్లంతా ఒక్కొక్కరిగా జంపింగ్ బాట పడుతున్నారు. పవర్‌లో ఉన్నప్పుడు జగన్‌కు దగ్గరి వాళ్లమని చెప్పుకున్న నేతలు హ్యాండిస్తున్నారు. షర్మిల నుంచి మొదలు ఇప్పుడు బాలినేని వరకు..మోపిదేవి నుంచి జగన్ క్లాస్‌మెట్ రాజీవ్ కృష్ణ వరకు అందరూ తమ దారి తాము చూసుకుంటున్నారు. వరుస పెట్టి ఫ్యామిలీ ఫ్రెండ్స్, పొలిటికల్ ఫ్రెండ్స్ జగన్‌కు దూరమవుతుండటం చర్చనీయాంశంగా మారింది. ఈ క్రమంలోనే చిన్ననాటి క్లాస్‌మెట్ కూడా జగన్‌కు బై బై చెప్పి పసుపు కండువా కప్పేసుకున్నారు. కొవ్వూరు మాజీ ఎమ్మెల్యే పెండ్యాల కృష్ణబాబు అల్లుడు, జగన్ స్నేహితుడు, క్లాస్ మెట్ అయిన రాజీవ్ కృష్ణ పార్టీని వదిలివెళ్లిపోయారు. వైసీపీ హయాంలో ప్రభుత్వ సలహాదారుగా, అధికార ప్రతినిధిగా వ్యవహరించిన రాజీవ్ కృష్ణ..టీడీపీ గూటికి చేరిపోయారు. దీంతో జంపింగుల వ్యవహారంపై మరోసారి చర్చ మొదలైంది.తల్లి ప్రత్యక్షంగా జగన్‌కు దగ్గరగా లేరని చెప్పుకుంటున్నారు వైసీపీ నేతలు. ఇక చెల్లి ప్రధాన ప్రత్యర్థిగా మారిన పరిస్థితి కనిపిస్తూనే ఉంది. బాలినేని, మోపిదేవి వెంకటరమణ, ఆళ్లనాని ఇలా అయిన వాళ్లు కూడా పార్టీని వీడి వెళ్లిపోయారు. వైఎస్సార్ స్నేహితులు, సహచరులు, సన్నిహితులు వంటి వారు జగన్ దరిదాపుల్లో కూడా లేరని అంటున్నారు. రాజ్యసభ సభ్యులైన మోపిదేవి వెంకటరమణ, బీద మస్తాన్‌రావు, ఎమ్మెల్సీలు పోతుల సునీత, కర్రి పద్మశ్రీ, బల్లి కల్యాణ్ చక్రవర్తి వైసీపీని వీడారు.ఇక మాజీమంత్రులు బాలినేని శ్రీనివాస్‌రెడ్డి, ఆళ్ల నాని, మాజీ ఎమ్మెల్యేలు కిలారు రోశయ్య, మద్దాల గిరి, పెండెం దొరబాబు, మహిళా కమిషన్ మాజీ ఛైర్మన్ వాసిరెడ్డి పద్మ జగన్‌కు హ్యాండిచ్చారు. వీళ్లలో ఎక్కువ మంది జగన్ పార్టీ పెట్టినప్పటి నుంచి వెంట నడిచిన నేతలు. అయితే అన్ని జిల్లాల్లో ఒక ఎత్తు అయితే ఉభయ గోదావరి జిల్లాల్లో అయితే వైసీపీకి చెప్పుకోదగ్గ నాయకులే లేకుండా పోయారట. భీమవరం మాజీ ఎమ్మెల్యే గ్రంథి శ్రీనివాస్ కొన్నాళ్లుగా పార్టీపై అసంతృప్తితో ఉన్నారు. ఎన్నికల్లో ఓడిన తర్వాత అసలు బయటకు రాని గ్రంధి పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు.అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత వైసీపీకి దెబ్బ మీద దెబ్బ తగులుతున్నాయి. గోదావరి జిల్లాల్లో ఫ్యాన్ పార్టీకి ప్రతికూల పరిస్థితులే కనిపిస్తున్నాయి. గత ఐదేళ్లు పదవులు అనుభవించిన వారు ప్రతిపక్షంలో ఉండలేమంటూ సైడైపోతున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఉభయ గోదావరి జిల్లాలను కూటమి క్లీన్ స్వీప్ చేయడంతో..వైసీపీ ముఖ్య నేతలు కొందరు సైలెంట్ అయిపోయారు. ఇంకొందరు అయితే టీడీపీ లేకపోతే జనసేనలోకి వెళ్లిపోతున్నారు. జడ్పీ ఛైర్మన్‌లు, మున్సిపల్ ఛైర్మన్లు.. ఇలా అందరిది కూటమి బాటే అయిపోయింది.గోదావరి జిల్లాలోని అన్ని నియోజకవర్గాల నుంచి వైసీపీలో వివిధ స్థాయిల్లో పని చేసిన నేతలు టీడీపీ, జనసేన, బీజేపీల్లో చేరడానికి అనేక ప్రయత్నాలు చేస్తున్నారు. కొవ్వూరుకు చెందిన ప్రముఖ పారిశ్రామిక వేత్త, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో కింగ్ మేకర్‌గా వ్యవహరించిన మాజీ ఎమ్మెల్యే దివంగత పెండ్యాల కృష్ణబాబు అల్లుడైన ఎస్.రాజీవ్ కృష్ణ టీడీపీలో చేరడంతో ఇక వైసీపీ పరిస్థితి ఏంటనేది చర్చనీయాంశమైంది. ఆయనతో పాటు జడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు పార్టీ మారడంతో కార్యకర్తలు కూటమి వైపే చూస్తున్నారుమాజీ ఎంపీలు, సిట్టింగ్ ఎమ్మెల్సీలు, రాజ్యసభ సభ్యులు, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు జడ్పీ, మున్సిపల్ ఛైర్మన్లు.. ఇలా ఒకరేంటి వరుసగా వైసీపీని వీడుతున్న నేతల సంఖ్య చాంతాడులా పెరిగిపోతూనే ఉంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత నైరాశ్యంలో కూరుకుపోయిన పార్టీలో జోష్ నింపాల్సిన నేతలు పూర్తిగా డీలా పడిపోతున్నారా అన్న అనుమానం వ్యక్తమవుతోంది. వరుసగా నేతల వలసలను పరిశీలిస్తే నియోజకవర్గాల్లో వైసీపీని నడిపించే నాయకులు ఎవరన్న దానిపై చర్చ జరుగుతోంది. వలసలను ఆపలేక జగన్ చేతులు ఎత్తేశారా.. అధికారం లేనప్పుడు ఇదంతా కామన్ అని లైట్ తీసుకుంటున్నారా అన్నది ఆసక్తికరంగా మారింది.

## ఇదేం పద్ధతి..

-మొదటిపేజీ తరువాయి

తప్పుడు నివేదికలు ఇచ్చే పద్ధతులను అధికారులు వెంటనే మానుకోవాలని హితవు పలికారు. అసెంబ్లీకి తప్పుడు రిపోర్టులు ఇచ్చిన అధికారులపై యాక్షన్ తీసుకుంటే... మిగిలిన అధికారులు సెట్ అవుతారని చెప్పారు. జగనన్న కాలనీలపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టాలని అన్నారు.

ఈ నేపథ్యంలో మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ... జగనన్న కాలనీలపై విచారణకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పటికే ఆదేశించారని తెలిపారు. జగనన్న కాలనీలపై శాఖాపరమైన విచారణతో పాటు విజిలెన్స్ విచారణ కొనసాగుతోందని చెప్పారు.

**విజిలెన్స్ విచారణ కొనసాగుతుంది: మంత్రి కొలుసు పార్థ సారథి**

జగనన్న హౌసింగ్ ఇళ్లల్లో పూర్తి విచారణ చేయాలని సీఎం చంద్రబాబు ఇప్పటికే ఆదేశించారని మంత్రి కొలుసు పార్థ సారథి తెలిపారు.జగనన్న కాలనీల్లో డిపార్ట్‌మెంట్..విజిలెన్స్ విచారణ కొనసాగుతుందని చెప్పారు. అవసరమైతే సభ్యులు సూచనలు ఇస్తే కాంట్రాక్టర్లను మార్చేందుకు సిద్ధంగా ఉన్నామని అన్నారు.

**ఇళ్ల నిర్మాణాలు ముందుకు సాగడం లేదు: ఎమ్మెల్యే గనబాబు**

హౌసింగ్ ఇళ్ల నిర్మాణాలు ముందుకు సాగడం లేదని ఎమ్మెల్యే గనబాబు అన్నారు. లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. హౌసింగ్ ఇళ్లా నిర్మాణాలపై ప్రభుత్వం విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు.

**అధ్వాన్నంగా జగనన్న కాలనీల నిర్మాణాలు: ఎమ్మెల్యే వరద రాజుల రెడ్డి**

జగనన్న కాలనీల నిర్మాణాలు అధ్వాన్నంగా ఉన్నాయని ప్రొద్దుటూరు ఎమ్మెల్యే వరద రాజుల రెడ్డి చెప్పారు. చిన్న వర్షాలకు ఇల్లు కూలిపోయేలా ఉన్నాయని తెలిపారు.జగనన్న కాలనీల్లో కాంట్రాక్టర్లు భారీగా అక్రమాలు జరిగాయని ఆరోపించారు. కోట్లాది రూపాయల ప్రజాధనం కాంట్రాక్టర్లు దండుకున్నారని మండిపడ్డారు.

## వైసీపీ ప్రభుత్వ పాలనలో చాలా లోపాలున్నాయి

-మొదటిపేజీ తరువాయి



కొనసాగిస్తారా లేదా అని వైసీపీ ఎమ్మెల్సీ కల్పలతా రెడ్డి ప్రశ్నించారు. సభ్యుల ప్రశ్నలకు మంత్రి అనిత సమాధానం ఇస్తూ వైసీపీ ప్రభుత్వ పాలనలో చాలా లోపాలున్నాయని మంత్రి అనిత తెలిపారు. దిశ చట్టం లేదు. నిర్భయ చట్టం ఉంది. నిర్భయ కింద వైసీపీ ప్రభుత్వంలో కేసులు ఎందుకు నమోదు చేయలేదని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం నిధులిచ్చిన అమరావతిలో ఫోరెన్సిక్ ల్యాబ్ ఎందుకు నిర్మించలేదని వైసీపీ సభ్యులు నిలదీశారు. గంజాయి వినియోగం పెరగడంతో రాష్ట్రంలో నేరాలు పెరిగాయని మంత్రి అనిత వివరించారు. అయితే హోం మంత్రి అనిత వ్యాఖ్యలను వైసీపీ సభ్యులు అడ్డుకున్నారు. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ ఫెయిల్ అయిందంటూ వైసీపీ నినాదాలు చేసింది. లా అండ్ ఆర్డర్ ఫెయిల్ కారణంతోనే నీలాంటి వారు సభకు వస్తున్నారని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌ను ఉద్దేశించి మంత్రి అనిత అన్నారు. తన సమాధానం వినటానికి దమ్ము, ధైర్యం కావాలని మంత్రి అనిత అన్నారు. మంత్రి వ్యాఖ్యలకు నిరసనగా వైసీపీ సభ్యులు వాకౌట్ చేశారు. తర్వాత ప్రశ్నకు వైసీపీ సభ్యులు సభలోకి వచ్చారు.

## వారిని కోల్పోవడం చాలా బాధాకరం..



-మొదటిపేజీ తరువాయి

హిందూ బాలికలు అపహరణకు గురవడంతో మైనారిటీలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. తాజాగా పాకిస్థాన్‌లోని సింధ్‌లో ఇంటికి తిరిగి వెళ్తున్న ఓ హిందూ బాలికను దుండగులు అపహరించుకుపోయారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా ఆమె జాడ తెలియడం లేదు. హిందువులు, ఇతర మైనారిటీలు పాకిస్థాన్ జనాభాలో కేవలం 3.5 శాతం మంది మాత్రమే ఉన్నారు. ఈ మైనారిటీలంతా మెజారిటీ ముస్లింల చేతుల్లో మత హింసకు గురవుతున్నారు. బలవంతపు మతమార్పిడులను నిరోధించేందుకు ఉద్దేశించిన బిల్లును గత ఏడాది అక్టోబరులో పార్లమెంటరీ ప్యానెల్ తిరస్కరించింది. పాకిస్థాన్‌లోని సింధ్ ప్రావిన్స్, హైదరాబాద్ పట్టణంలో ఇటీవల ఓ హిందూ బాలిక చంద్ర మహరాజ్‌ను కొందరు దుండగులు అపహరించారు. బాధితురాలి తల్లిదండ్రులు చెబుతున్నదాని ప్రకారం, చంద్రను ఫతే చౌక్ ప్రాంతంలో కిడ్నాప్ చేశారు. ఆమె ఇంటికి తిరిగి వెళ్తున్న సమయంలో ఈ దారుణం జరిగింది. పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ, ఆమె జాడ ఇంకా తెలియడం లేదు. కొద్ది రోజుల క్రితం ముగ్గురు హిందూ మహిళలను కిడ్నాప్ చేసి, బలవంతంగా ఇస్లాంలోకి మార్చినట్లు వార్తలు వచ్చాయి. దీంతో మైనారిటీ హిందువులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## ఏడు బిల్లులకు ఆమోదముద్ర వేసిన ఏపీ అసెంబ్లీ



**అమరావతి :** ఏడు కీలక బిల్లులకు ఏపీ అసెంబ్లీ ఆమోదం తెలిపింది. ఏపీ మున్సిపల్ సవరణ బిల్లు – 2024, ఏపీ పంచాయతీరాజ్ సవరణ బిల్లు – 2024, హెల్త్ యూనివర్శిటీ సవరణ బిల్లు – 2024, ఏపీ ల్యాండ్ గ్రాబింగ్ నిరోధక బిల్లు – 2024, ఆయుర్వేదిక్ హోమియోపతి మెడికల్ ప్రాక్టిషనర్స్ చట్ట సవరణ, ఏపీ మెడికల్ ప్రాక్టిషనర్స్ రిజిస్ట్రేషన్ చట్ట సవరణ బిల్లు – 2024లను అసెంబ్లీ ఆమోదించింది. ఏపీ సహకార సంఘం సవరణ బిల్లు – 2024, ఎంత మంది పిల్లలు ఉన్నా స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు అవకాశం కల్పించేలా నిబంధనలు మారుస్తూ తీసుకొచ్చిన బిల్లులకు ఆమోదం తెలిపింది. అనంతరం అసెంబ్లీ సమావేశాలను స్పీకర్ అయ్యన్నపాత్రుడు రేపటికి వాయిదా వేశారు.

షణ్ముఖ వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు తెలుగు దినపత్రిక
ప్రకాశం

# వ్యవసాయం కోసం వినియోగించే మోటార్లకు స్మార్ట్ మీటర్లు బిగించే ప్రసక్తే లేదు

- గత ప్రభుత్వం విద్యుత్ వ్యవస్థలో లక్షా 29 వేల కోట్లు అప్పులు చేసింది
- పీపీఏలు రద్దు చేయవద్దని కేంద్రం చెప్పినా ప్రభుత్వం పెడచెవిన పెట్టింది
- పీపీఏల రద్దు వల్ల పెట్టుబడులు వెనక్కి వెళ్తాయన్నా గత సర్కారు వినలేదు
- వైసీపీ హయాంలో మెగావాట్ విద్యుత్ కూడా ఉత్పత్తి చేయలేదు
- విద్యుత్ వ్యవస్థను గాడిన పెట్టేలా కూటమి ప్రభుత్వ చర్యలు
- మండలిలో మంత్రి గొట్టిపాటి రవి కుమార్



**(షణ్ముఖ వెలుగు, అమరావతి, నవంబర్ 18)**
వ్యవసాయం మోటార్లకు స్మార్ట్ మీటర్లు బిగించే ప్రసక్తే లేదని మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. మండలి ప్రశ్నోత్తరాల సమయంలో దీనిపై మంత్రి గొట్టిపాటి రవి కుమార్ మాట్లాడారు. గత ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాల కారణంగా విద్యుత్ రంగ సంస్థలపై సుమారు రూ. 1.29 లక్షల కోట్ల భారం పడిందని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు. జగన్ మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత పీపీఏ ల రద్దు అంశం చాలా వివాదాస్పదం అయినట్లు మంత్రి పేర్కొన్నారు. కేవలం పీపీఏ ల రద్దు కారణంగా పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చిన పారిశ్రామికవేత్తలు ఇతర రాష్ట్రాలకు తరలిపోయినట్లు పేర్కొన్నారు. నాడు జగన్ మోహన్ రెడ్డి తీసుకున్న నిర్ణయం సరైనది కాదని కేంద్ర ప్రభుత్వం స్వయంగా లేఖ రాసిన విషయాన్ని మంత్రి గొట్టిపాటి గుర్తు చేశారు. ప్రతీ ఏడాది వినియోగదారుల సంఖ్య 5 నుంచి 6 శాతం పెరుగుతున్నా కానీ జగన్ ప్రభుత్వం అధికారంలో ఉన్న ఐదేళ్ల కాలంలో కొత్తగా ఒక్క మెగా వాట్ విద్యుత్ ను కూడా ఉత్పత్తి చేసిన పాపన పోలేదని విమర్శించారు. విద్యుత్ వ్యవస్థను గాడిన పెట్టేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. కూటమి ప్రభుత్వం గ్రీన్ అండ్ రెన్యూవబుల్ ఎనర్జీకి అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు. ఇందు కోసం ఏకంగా రాష్ట్ర ప్రభుత్వం పాలసీ తీసుకొచ్చిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. ఏపీ తీసుకొచ్చిన పాలసీ కారణంగా రాష్ట్రానికి పెట్టుబడులు క్రమంగా వస్తున్నాయని అన్నారు. గత ప్రభుత్వం తీసుకుని వచ్చిన చట్టం లోని లోపాలను సరిదిద్దే ప్రయత్నంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ విద్యుత్ సుంకం (రెండో సవరణ), 2024 బిల్లు తీసుకువస్తున్నాట్లు మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు. ఈ సవరణ వల్ల వినియోగదారులపై కొత్తగా (తరువాయి 4లో...)



# పట్టపగలే యథేచ్ఛగా మట్టి దోపిడీ



- కొండలు, చెరువులను కొల్లగొడుతున్న మట్టి మాఫియా
- పెద్దారవీడు మండలంలో ఆగని మట్టి దందా
- ప్రైవేటు వెంచర్లు విక్రయించి సొమ్ము చేసుకుంటున్న అక్రమార్కులు

**(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, నవంబర్ 18)**
ప్రకృతి వనరులైన చెరువును కొండలను సంరక్షించాల్సిన బాధ్యతను సంబంధిత అధికారులు విస్మరించటంతో పశ్చిమ ప్రకాశం పెద్దారవీడు మండలంలో మట్టి మాఫియా ఆగడాలు రోజు రోజుకు మితిమీరిపోతున్నాయి. ఎటువంటి అనుమతులు లేకుండా మట్టిని పట్టపగలే యదేచ్ఛగా మట్టిని కొల్లగొట్టి ప్రైవేటు వెంచర్లకు సరఫరా చేసి దోపిడి చేస్తున్నారు. ఎటువంటి అనుమతులు లేకపోయినా అక్రమంగా ఇష్టానుసారంగా కొండలు చెరువులను భారీ స్థాయిలో గోతులు తీసి మట్టిని తరలించడంతో కొండలు చెరువులు రూపు కోల్పోతున్నాయి. ఇటువంటి కోవెలకే పెద్దారవీడు మండలం రామయపాలెం గ్రామ శివారులో ఉన్న మూల మలుపు కొండ పక్కన కొండను మట్టి మాఫియా పట్టపగలే భారీ యంత్రాలు పెట్టి మట్టిని కొల్లగొట్టి టిప్పర్లు, డాక్టర్లతో అక్రమ రవాణా సాగిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఎటువంటి అనుమతులు లేకుండా ఎదేచ్ఛగా మట్టిని అక్రమంగా తరలిస్తున్న పట్టించుకోవాల్సిన భూగర్భ గనుల, రెవెన్యూ శాఖల అధికారులు మాత్రం తమకు ఏమాత్రం పట్టనన్నట్లు వ్యవహరిస్తున్నారు. టిప్పర్ కు 3000, ట్రాక్టర్కు 500 చొప్పున వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వేలువబడుతున్నాయి. కొందరు అధికారులు (తరువాయి 4లో...)

# అట్టహాసంగా ది పొదిలి కేఫ్ ప్రారంభం

### ప్రారంభించిన యువ నాయకులు కందుల విగ్నేష్‌రెడ్డి, కందుల రోహిత్ రెడ్డి




**(షణ్ముఖ వెలుగు, పొదిలి, నవంబర్ 18)**
పట్టణంలోని కర్నూల్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన "ది పొదిలి కేఫ్" ను మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి కుమారుడు యువ నేత కందుల విగ్నేష్‌రెడ్డి, కందుల రామిరెడ్డి కుమారుడు కందుల రోహిత్‌రెడ్డిలు సోమవారం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం కొబ్బరికాయలు కొట్టి స్వామి, అమ్మ వార్లకు గణపతి పూజ, ఇతర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని పలువురు టీడీపీ నేతలు వారిని కలిసేందుకు అక్కడకు భారీగా చేరుకున్నారు. పూజా కార్యక్రమం అనంతరం ది పొదిలి స్పెషల్ టీని స్వీకరించి అభినందనలు (తరువాయి 4లో...)



# ఏపీ హైకోర్టులో రామ్ గోపాల్ వర్మకు చుక్కెదురు

- అరెస్ట్ నుంచి రక్షించలేమన్న హైకోర్టు
- చంద్రబాబు, పవన్‌లపై గతంలో వర్మ అనుచిత పోస్టులు
- కేసు నమోదు చేసిన ఏపీ పోలీసులు
- అరెస్ట్ నుంచి తనను రక్షించాలని వర్మ పిటిషన్
- పిటిషన్‌ను తిరస్కరించిన హైకోర్టు
- బెయిల్ పిటిషన్ వేసుకోవాలని సూచన



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, నవంబర్ 18)**
ప్రముఖ సినీ దర్శకుడు రామ్ గోపాల్ వర్మకు ఏపీ హైకోర్టులో చుక్కెదురైంది. తనపై నమోదైన కేసును కొట్టివేయాలంటూ వర్మ దాఖలు చేసిన పిటిషన్ ను హైకోర్టు కొట్టివేసింది. కేసు వివరాల్లోకి వెళ్తే గత ఎన్నికలకు ముందు 'వ్యూహం' చిత్రాన్ని రామ్ గోపాల్ వర్మ తెరకెక్కించిన సంగతి తెలిసిందే. ఆ సందర్భంగా చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లను కించపరిచేలా వర్మ సోషల్ మీడియాలో ఎన్నో పోస్టులు పెట్టారు. సినిమాలో సైతం వీరిని కించపరిచే పలు సన్నివేశాలు ఉన్నాయి. ఈ క్రమంలో వర్మ పై ఉమ్మడి ప్రకాశం జిల్లా మద్దిపాడుకు చెందిన టీడీపీ నేత రామలింగం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదు మేరకు వర్మపై పోలీసులు కేసు నమోదు చేశారు. తమ విచారణకు హాజరుకావాలంటూ హైదరాబాద్‌లో ఉన్న వర్మకు ఏపీ పోలీసులు నోటీసులు ఇచ్చారు. నోటీసుల ప్రకారం రేపు పోలీసు విచారణకు వర్మ హాజరు కావాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ఆయన ఏపీ హైకోర్టును ఆశ్రయించారు. అరెస్ట్ నుంచి తనకు రక్షణ కల్పించాలని, తనపై నమోదైన కేసును కొట్టివేయాలని కోరుతూ హైకోర్టులో ఆయన పిటిషన్ దాఖలు చేశారు. ఆయన పిటిషన్‌ను ఈరోజు హైకోర్టు విచారించింది. అరెస్ట్ నుంచి తాము రక్షించలేమని వర్మ న్యాయవాదికి కోర్టు స్పష్టం చేసింది. ఏదైనా ఉంటే బెయిల్ పిటిషన్ వేసుకోవాలని సూచించింది. రేపటి పోలీసు విచారణకు హాజరు కావాలని ఆదేశించింది.

# అట్టహాసంగా ది పొదిలి కేఫ్ ప్రారంభం



తెలిపి తొలి బోణి చేసి వ్యాపారం అభివృద్ధి చెందేలా కృషి చేయాలని సూచిస్తు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాణ్యతలో రాజీ పడకుండా ప్రజలకు రుచికరమైన టీ, కాఫీలను అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డు మెంబర్ జ్యోతి మల్లిఖార్జున, వరికూటి సురేష్, కాలేషా, మహమ్మద్, నాగార్జున యాదవ్, గొంట్ల సాయి, గొంట్ల రవి, నిర్వాహకులు కె విజయ్, భాషా, సాంబ, సాయి, రసూల్, రాధాకృష్ణ దాస్, ఇతర టీడీపీ నాయకులు, కార్యకర్తలు, స్నేహితులు, తదితరులు పాల్గొన్నారు.



# పట్టపగలే యథేచ్ఛగా మట్టి దోపిడీ



అక్రమార్కులకు మద్దతు తెలపటంతో ఈ అక్రమ మట్టి దందా పట్టపగలే యదేచ్ఛగా సాగుతున్నట్లు సమాచారం. ప్రకృతి వనరులైన చెరువులు, కొండల లో మట్టి తరలించడానికి అనుమతి తీసుకోవాల్సి ఉండగా తీసుకోకుండా ఇష్టానుసారంగా తవ్వకాలు చేపట్టి మట్టిని సరఫరా చేసి లక్షలు దోసుకుంటున్నాను. ప్రభుత్వానికి పన్ను రూపంలో రావలసిన ఆదాయం మొత్తం అక్రమార్కుల చేతుల్లోకి వెళ్తుంది. పట్టపగలే అక్రమంగా మట్టిని తరలిస్తున్న అధికారులు పట్టించుకోకపోవడం తో విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. రామయపాలెం గ్రామంలో రోజుకు పది టిప్పర్లు, 15 ట్రాక్టర్లు తో మట్టిని సరఫరా చేసి అధికార పార్టీ నేతలు అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. గత ఐదేళ్ల కాలంలోనూ ప్రస్తుతం ఇప్పుడు ఇదే పరిస్థితి జోరుగా జరుగుతుంది. ఎటువంటి మార్పు జరగలేదు. అక్రమానికి అడ్డుగా నిలవాల్సిన అధికారులు అక్రమార్కులకు వంత పడటంతో మట్టిని ప్రైవేటు వెంచర్లకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. తక్షణమే మట్టి అక్రమ రవాణాపై చర్యలు తీసుకుని నిలుపుదల చేయాలని పెద్దారవీడు మండల ప్రజలు కోరుతున్నారు.

**అనుమతులు మంజూరు చేయలేదు :** మండలంలోని కొండలు, చెరువులలో మట్టి తవ్వకాలపై మండల తహసిల్దార్ సైంధవ కుమార్‌ను షణ్ముఖ వెలుగు దినపత్రిక ప్రతినిధి వివరణ కోరగా తాము ఎలాంటి అనుమతులు ఎవరికి ఇవ్వలేదన్నారు. తమ దృష్టికి అక్రమ మట్టి తవ్వకాలపై సమాచారం వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయండి

## రాష్ట్ర కార్యదర్శి కోటపాటి



**(షణ్ముఖ వెలుగు, పామూరు, నవంబర్ 18)**

మండలంలోని బోట్ల గూడూరు గ్రామంలో సోమవారం తెలుగు దేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి కోటపాటి జనార్ధన్ రావు పరిశీలించారు. టిడిపి సభ్యత్వ నమోదును ఇంకా వేగవంతం చేయాలని ఆయన టిడిపి నాయకులకు, కార్యకర్తలకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వై బాల, టిడిపి నాయకులు అడుసు మల్లి ప్రభాకర్, అడుసుమల్లి నరసింహులు, అనపర్తి శశి మహేశ్వరరావు, కోటపాటి రాజా, గుర్రాల నాగేశ్వరరావు, లక్ష్మయ్య, కోటపాటి నరసింహారావు, కమ్మ నరసింహ, చిన్న పుల్లయ్య పాల్గొన్నారు.

# రెండో విడత అంతర కళాశాలల క్రీడల సమ్మేళణంలో కదిరి వ్యవసాయ కళాశాల విద్యార్థులు





**(షణ్ముఖ వెలుగు, పామూరు, నవంబర్ 18)**

ఆచార్య ఎన్ జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రెండో విడత అంతర కళాశాలల క్రీడలు,సాహిత్యం,సాంస్కృతిక సమ్మేళనం సోమవారం నుండి బాపట్ల వ్యవసాయ కళాశాల లో జరుగుచున్నవి. ఈ క్రీడల పోటీలలో సిఎస్ పురం కదిరి బాబురావు వ్యవసాయ కళాశాల విద్యార్థులు పాల్గొని మంచి ప్రతిభ కనుబరుస్తున్నారని పిజికల్ మాస్టర్ బండారు రవీంద్ర బాబు తెలిపారు.ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ సుస్మిత,ఫిజికల్ మాస్టర్స్ బి మౌనిక, బండారు రవీంద్రా బాబు,విద్యార్దులు,తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయం కోసం వినియోగించే మోటార్లకు స్మార్ట్ మీటర్లు బిగించే ప్రసక్తే లేదు

అదనపు భారం గానీ, విద్యుత్ సుంకం కానీ విధించడం లేదని స్పష్టం చేశారు. ఈ బిల్లును వైసీపీ ప్రభుత్వం 2021 లోనే తీసుకుని వచ్చినా... సుంకం విధించే విషయంపై ఎక్కడా స్పష్టత ఇవ్వలేదని పేర్కొన్నారు. 2014లో తెలుగుదేశం పార్టీ అధికారం చేపట్టే నాటికి విద్యుత్ అంతరాయాలు ఏపీలో ఎక్కువగా ఉండేవని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు. విద్యుత్ వినియోగానికి జరిమానాలు వేసిన విష సంస్కృతి నాడు ఉండేదని దుయ్యబట్టారు. తిరిగి చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చిన తరువాత నుంచి ఒక్క రూపాయి కూడా విద్యుత్ చార్జీలు పెంచకుండా పాలించిన ప్రభుత్వం తమదని మంత్రి పేర్కొన్నారు. చంద్రబాబు నాయుడు అధికారం నుంచి దిగిపోయే నాటికి ఈఆర్సీకి కేవలం రూ. 3 వేల కోట్ల మాత్రమే అప్పు ఉన్నట్లు మంత్రి గొట్టిపాటి గుర్తు చేశారు. జగన్ మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత 2022-23 ఏడాదికి రూ. 6 వేల కోట్లు అప్పు ఉన్నట్లు చూపించారని పేర్కొన్నారు. దీనితో పాటు 2023-24 ఏడాదికి కూడా ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు స్పష్టం చేశారు. మొత్తంగా రూ. 17 వేల కోట్లు ప్రజలపై భారం వేయాలని వైసీపీ ప్రభుత్వం ప్రయత్నించిందని మండిపడ్డారు. వైసీపీ పాలనలో విద్యుత్ రంగం సర్వనాశనం అయ్యిందని నమ్మిన ప్రజలు వారిని 11 సీట్లకే పరిమితం చేసినట్లు విమర్శించారు.

# ఎస్సీ, ఎస్టీ కులాలకు చెందిన భూములను ఆక్రమిస్తున్న కబ్జాదారులు

## కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన ఎమ్మార్పీఎస్ నాయకులు



**(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, నవంబర్18)**

కనిగిరి నియోజకవర్గంలోని సిఎస్ మండలం గుంతచనంపల్లి గ్రామానికి చెందిన ఎస్సీ, ఎస్టీ భూములను భూ బకాసురులు ఆక్రమిస్తుంటే ఎస్సీ ,ఎస్టీ కులానికి చెందిన గ్రామస్తులు స్థానిక ఎమ్మార్పీఎస్ నాయకులు ఎం ఎస్ పి జిల్లా అధ్యక్షులు తోరటి ఆనంద్ మాదిగ కనిగిరి నియోజకవర్గం ఇంచార్జ్ రావినూతల కోటయ్య మాదిగ, కనిగిరి నియోజకవర్గ కో ఇన్చార్జి జేపీ రాజు మాదిగను ఆశ్రయించగా వారు విషయాలను తెలుసుకొని సోమవారం స్పందన కార్యక్రమంలో ఆ గ్రామస్తులు తీసుకుపోయి జిల్లా కలెక్టర్ తమీం అన్సారియా కలిసారు. ఆ గ్రామస్తులు వివరాల ప్రకారం సిఎస్ పురం మండలంలోని గుంత చెన్నంపల్లె గ్రామానికి చెందిన ఎస్సీ, ఎస్టీ కులములకు చెందిన వారు మా యొక్క పూర్వీకులకు 1975 సంవత్సరంలో సర్వేనెంబర్ 234లో 37 ఎకరాల 44 సెంట్లు భూమి ఎఫ్ ఎల్ ఆర్ ప్రకారము 12 మంది పేర్లు నమోదు చేసియున్నారు . భూమిపై కూడా మేము సాగు చేసుకుని చున్నాము. ఇందులో 12 మంది భాగస్తులు ఉన్నారు. సదర భూమి ఉన్నప్పటికీ తీవ్ర వర్షబవ పరిస్థితుల్లో ఉన్నందున సదరు భూమిలో ఎలాంటి సాగు చేసుకుని ఉండలేదు . అందువలన 2014 సంవత్సరంలో అసైన్మెంట్ పట్టాలు ఉన్న వారందరూ కలిసి సామూహికంగా భూమిపై చెట్లు కొట్టుకొని భూమిని వ్యవసాయ మార్గంగా చేసుకుని మొక్కలు నాటారు. మా యొక్క గ్రామానికి చెందిన తోట చిన్న పెద్దయ్య కుమారుడు తోట శ్రీరాములు అనువారు మీకు భూములు లేవని మాదిగలకు భూములు ఎక్కడున్నాయి. మేమిస్తే తప్పించి ఎక్కడ లేవు. నిత్యం మాపై దాడి చేయటం మమ్మల్ని కులం పేరుతో తిట్టడం జరుగుతుంది . మేము వేసిన జామాయిల్ లో కొట్టుకోవటానికి వెళ్ళినప్పుడు అతని వర్గానికి చెందిన అగ్రవర్ణ ఓసి కులస్తులను నిన్న రాత్రి ఆదివారం సుమారు సాయంత్రం ఏడు గంటల సమయంలో తీసుకొని వచ్చి శ్రీరాములు కొత్తగా దొంగ పాస్ బుక్కులు పుస్తకాలు సృష్టించుకుని, సుమారు 40 ఎకరాలు భూమిని ఆక్రమించాడు. శ్రీరాములు అనే అతను మిమ్మలను కేవలం ఓట్లు కోసము ఏమి అనలేకపోతున్నాము. ఇండ్లలోకి వచ్చి దూరిపొల్లించు తన్నేవాళ్ళము . మీ మాదిగ కులస్తులకు ఇంత నోరు వచ్చిందా అని అసభ్యకర పదజాలలతో మమ్ములను కులం పేరుతో తిట్టి మా ఎస్సీ, ఎస్టీ కులాల వారి మీద కొట్టడానికి ప్రయత్నం చేస్తున్నాడు. ఈ విషయాన్ని మందకృష్ణ మాదిగ కలవగా ఆయన లెటర్ ప్యాడ్ మీద కలెక్టర్‌కి అర్జీ ఇవ్వమని ఆయన అనటంతో ఈరోజు కలెక్టర్‌ని కలవడం జరిగినది. కలెక్టర్ సానుకూలంగా స్పందించి తిరిగి బుధవారం సాయంత్రం ఐదు గంటలకు రావాలని ప్రత్యర్థులను కూడా రప్పిస్తామని నీకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

# ఆల్ ఇండియన్ హ్యూమన్ రైట్స్ జిల్లా ముస్లిం మైనారిటీ అధ్యక్షుడిగా సయ్యద్ జబివుల్లా





**(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం ఇన్‌ఛార్జి, నవంబర్18)**

యర్రగొండపాలెంకు చెందిన ముస్లిం మైనారిటీ నాయకులు సయ్యద్ జబివుల్లా తనకు యర్రగొండపాలెం నియోజకవర్గంతో పాటు ప్రకాశం జిల్లా లో రాష్ట్రంలో తను చేసే సేవాకార్యక్రమాలతో మంచిపేరువున్న వ్యక్తి ఇది ఇలా వుండగా హైదరాబాద్‌లోని ఆల్ ఇండియన్ హ్యూమన్ రైట్స్ నేషనల్ డైరెక్టర్ డాక్టర్ సురేష్ కుమార్ దంపతులు గతంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆల్ ఇండియన్ హ్యూమన్ రైట్స్ అధ్యక్షుడిగా యర్రగొండపాలెం వాసి చేదూరి కన్నాను నియమించారు. అలాగే ఇప్పుడు ఆల్ ఇండియన్ హ్యూమన్ రైట్స్ ప్రకాశం జిల్లా ముస్లిం మైనారిటీ అధ్యక్షుడిగా సయ్యద్ జబివుల్లాను తాము నియమించినట్లు తెలిపారు, సయ్యద్ జబివుల్లాను నియమించిన పత్రాలను ఐడీ కార్డును రాష్ట్ర అధ్యక్షులు చేదూరి కన్నా , యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ చేతుల మీదుగా అందుకోవడం జరిగింది . ఈ సందర్భంగా సయ్యద్ జబివుల్లా మాట్లాడుతూ ఆల్ ఇండియన్ హ్యూమన్ రైట్స్ నాకు ఈ బాధ్యత అప్పగించినందుకు నేను చాలా సంతోషిస్తున్నానని ఈ బాధ్యతలో నా వంతు కృషి నేను చేస్తానని తెలిపారు. ఈ విషయంలో యర్రగొండపాలెం నియోజకవర్గం లోని ప్రజలు సయ్యద్ జబివుల్లా కు హర్షం వ్యక్తం చేశారు.

# జిల్లా ఎస్పీని కలిసిన డాక్టర్ మీర్జా షంషీర్ అలీబేగ్

**(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, నవంబర్ 18)**




ప్రకాశం జిల్లా వైయస్‌ఆర్‌సీపీ నాయకులు, మాజీ రాష్ట్ర ముస్లిం మైనార్టీ ఫైనాన్స్ చైర్మన్, ఏ 1 గ్లోబల్ ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ డాక్టర్ మీర్జా షంషీర్ అలీబేగ్ సోమవారం ప్రకాశం జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్‌ను ఒంగోలు జిల్లా పోలీస్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. దుశ్శాలువాతో సన్మానించారు. అనంతరం మార్కాపురం పట్టణంలోని పలు అంశాలపై ఎస్పీతో చర్చించారు.

# బంగారు బాల్యం భవిష్యత్తుకు బలం

## ఎంపిడిఓ శ్రీనివాసరావు

**(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం టౌన్, నవంబర్ 18)**



స్థానిక మండల పరిషత్ కార్యాలయం నందు యంఇఓ ఆంజనేయులు అధ్యక్షతన జరిగిన బంగారు బాల్యంలో భాగంగా గంగా సదా బాలల సేవలో కార్యక్రమ పోటీలకు అన్ని ప్రాథమికోన్నత ఉన్నత పాఠశాలల నుంచి 150 మంది విద్యార్థులు, మండల స్థాయి వ్యాసరచన, డిబేట్ చిత్ర లేఖనం, స్లోగన్స్ పోటీలలో ఉత్సహంగా పాల్గొన్నారు. విజేతలు మంగళవారం జరిగే డివిజన్ స్థాయి పోటీలకు మార్కాపురం వెళ్లాలన్నారు. విజేతలకు ఎంపిడిఓ బహుమతులు, సార్డ్ ఎన్జీవో వారు సర్టిఫికెట్స్ ఇచ్చినందుకు ఎంఈఓ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన ఎంపిడిఓ శ్రీనివాసరావు మాట్లడుతూ బాల, బాలికలను ఒకేలా చూడాలని బాలికలపై చిన్నచూపు తగదని వారిని ప్రోత్సహిస్తే ఎన్నో అద్భుతాలు సృష్టిస్తారని కొనియాడారు.బాలికలపై భౌతిక దాడులు లైంగిక వేధింపులు అసమానత్వ భావన రోజురోజుకూ పెరిగిపోతున్నాయనీ బాలికలను శారీరకంగానే గాక మానసికంగా దృఢంగా తయారయ్యేలా చూడాలనీ ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. డిప్యూటీ తహశీల్దార్ మల్లిఖార్జున నాయుడు మాట్లడుతూ ప్రతి పాఠశాలలో కూడా తల్లిదండ్రుల సమావేశాలు ఏర్పాటు చేసి విద్యార్థుల ప్రగతి ప్రతిభను తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కొన్ని విభాగాలలో పోటీలు నిర్వహించారు. పోటీలలో గెలిచిన వారికి బహుతులు సర్టిఫికెట్ అందచేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిలతో పాటు ఈఓఆర్డి రాజశేఖర్ రెడ్డి ఐసీడీఎస్ సూపర్వైజర్ పద్మజ సార్డ్స్ ప్రతినిధులు మహాలక్ష్మి మరియ బాబు తదితరులు పాల్గొన్నారు.



# ఆవాస్ యోజన పథకాన్ని సద్వినియోగపర్చుకోవాలి

## టిడిపి రాష్ట్ర కార్యదర్శి కోటపాటి

**(షణ్ముఖ వెలుగు, పామూరు, నవంబర్ 18)**



కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆవాస్ యోజన పథకాన్ని అర్హులైన లబ్ధిదారులందరూ ఈ పథకాన్ని వినియోగించుకోవాలని టిడిపి రాష్ట్ర కార్యదర్శి సోమవారం బొట్ల గుడూరు, కంబాలదిన్నె పంచాయతీ ప్రజలతో సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ప్రతి ఒక్కరు గృహం కలిగి ఉండాలని ఆయన అన్నారు ఈ ప్రభుత్వం లక్ష్యమని ఆయన అన్నారు .అనంతరం సచివాలయాల్లో ప్రజలకు అందుతున్న సేవలు గురించి అడిగి తెలుసుకున్నారు. సమస్యలపై వచ్చిన ప్రజలకు వారి సమస్యలను పరిష్కరించాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ డిఈ కోటిరెడ్డి రాజమోహన్, పంచాయతీ కార్యదర్శులు, పంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# శబరిమలకు బయలుదేరిన అయ్యప్పస్వాములు





**(షణ్ముఖ వెలుగు, మద్దిపాడు, నవంబర్ 18)**

మండలంలోని పెదకొత్తపల్లి గ్రామపంచాయతీలోని అంజయ్య నగర్‌లో అయ్యప్ప స్వాములు 41 రోజు దీక్ష తీసుకొని సోమవానెరం ఇరుముడి కట్టుకొని శబరిమల అయ్యప్ప స్వామి దర్శనమునకు బయలుదేరారు ముందుగా నగరంలో స్వామియే శరణమయ్యప్ప అంటూ గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు అనంతరం గ్రామంలోని ప్రజలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంజయ్య నగర్ లోని గ్రామంలోని ప్రజలు, భవాని స్వాములు శివయ్య, స్వాములు పాల్గొన్నారు.

# 108 నిర్వహణను ప్రభుత్వమే చేపట్టాలి

## సిఐటియు గౌరవాధ్యక్షులు కాలం సుబ్బారావు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, నవంబర్ 18)

108 సర్వీసెస్ కాంటాక్ట్ ఎంప్లాయిస్ సమస్యలు ఈ నెల 25వ తేదీలోపు పరిష్కారం చేయకపోతే 26 నుండి జరిగే సమ్మెకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని సిఐటియు ప్రకాశం జిల్లా అధ్యక్షుడు, ప్రకాశం జిల్లా 108 సర్వీసెస్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు కాలం సుబ్బారావు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఒంగోలు కలెక్టరేట్ ఎదుట యూనియన్ జిల్లా అధ్యక్షుడు దర్గా మస్తాన్వలి అధ్యక్షతన జరిగిన రిలే దీక్ష శిబిరాన్ని ప్రారంభిస్తూ కాలం సుబ్బారావు మాట్లాడుతూ 108 నిర్వహణను ప్రభుత్వమే చేపట్టాలని కోరారు. అరవిందో యాజమాన్యం గత నాలుగు సంవత్సరాల నుంచి కాంట్రాక్టు ఉద్యోగులను తీవ్రమైన ఇబ్బందులకు గురిచేస్తుందని విమర్శించారు. కార్మిక చట్టాల ప్రకారం రోజుకు 8 గంటల పని దినం ఉండాల్సి ఉంటే 12 గంటలు పని చేయించుకుంటూ ఎలాంటి అదనపు వేతనము(ఓటి) ఇవ్వకుండా వెట్టిచాకిరి చేయించుకోవడం దుర్మార్గమని విమర్శించారు. కార్మికుల దగ్గర నుండి పీఎఫ్ ఈఎస్ఐ తాలూకా డబ్బులను యాజమాన్యం కటింగ్ చేస్తూ యాజమాన్యంవాటాన్ని చెల్లించకుండా కార్మికుల దగ్గర నుండే వసూలు చేయడం ద్వారా కొన్ని కోట్ల రూపాయల్ని అరబిందో యాజమాన్యం కార్మికుల దగ్గర నుండి దోచుకుందని వాటన్నిటిని ప్రభుత్వం అరబిందో యాజమాన్యపై చర్యలు తీసుకొని ఆ డబ్బుని తిరిగి కార్మికుల ఖాతాలో చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. రాష్ట్రంలో వందలాది ప్రభుత్వ సంస్థలని నిర్వహిస్తున్న ప్రభుత్వంఈ 108 ని నిర్వహించడం చేతకాక నా లేక ప్రవేట్ సంస్థలకి లాభాలు చేకూర్చిపెట్టే దుష్ట ఆలోచనతోటి కాంట్రాక్టు సంస్థలకి ఈ 108 సర్వీసెస్ ని నిర్వహణను అప్పచెప్తుందా అని ప్రశ్నించారు .కార్మికుల న్యాయమైన సమస్యలను పరిష్కారం చేయకుండా అరవింద్ యాజమాన్యం కక్ష సాధింపు చర్యలకు చేపట్టటం జరుగుతుందని ఈ విధానాలు మానుకోవాలని లేకుంటే తీవ్రమైన పోరాటానికి వెళ్లవలసి వస్తుందని హెచ్చరించారు .ఈ సంస్థలో గత 20 సంవత్సరాల నుండి పనిచేస్తున్న అర్హులైనటువంటి వారికి వివిధ ప్రభుత్వ శాఖలలో నియామకాలు జరిగే సందర్భంలో వీరికి వెయిటేజ్ ఇచ్చి నియమించటం ప్రభుత్వం బాధ్యత కాదా? వీరు ఆంధ్రప్రదేశ్ పౌరులు కారా ఎందుకు ఈ విధమైన వివక్షత చూపుతున్నదని అడిగారు. ప్రభుత్వం వెంటనే చొరవ తీసుకొని వాళ్ల డిమాండ్లను పరిష్కారం చేయాలని కోరారు. వార్షిక ఇంక్రిమెంట్లు ,బోనసులు, మానుకున్న వారికి గ్రాట్యుటీ చెల్లించకుండా అరవింద్ దోపిడీకి పాల్పడతా ఉందని ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కారం చేయకపోతే 26నుండి జరిగే సమ్మెకు సిఐటియు ,సిఐటియు అనుభంద యూనియన్లు సంపూర్ణ మద్దతు తెలియచేస్తున్నాయని చెప్పారు. యూనియన్ అధ్యక్షుడు దర్గా మస్తాన్వలి మాట్లాడుతూ గత ప్రభుత్వం జీవో నెంబర్ 49 ద్వారా 4000 రూపాయలు చెల్లించేవారు దానిని వైసీపీ ప్రభుత్వం రద్దు చేసింది దానిని పునరుద్ధరించాలని కోరారు. ప్రతినెల మొదటి వారంలో జీతాలు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు .యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ సిహెచ్ భాస్కర్ మాట్లాడుతూ నాలుగు సంవత్సరాల నుంచి అరవింద యాజమాన్యం ఇంక్రిమెంట్లు వేయకుండా పాత వేతనాలకే ఉద్యోగులు చేత పని చేయించుకుంటూ వెట్టిచాకిరి చేయిస్తుందని ఈ నాలుగు సంవత్సరాలలో పెరిగిన నిత్యవసర సరుకులు ధరలు విద్యా వైద్య ఖర్చులు ఇంధన ఖర్చులు వీటన్నిటిని పరిగణలో తీసుకొని వేతనాలు పెంచి అరియర్స్ తో సహా చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగాలు నియామకాల్లో ఎలాంటి వెయిటేజీ ఇవ్వకుండా ఉండటం మూలంగా ఉన్నత చదువులు చదివి ఈ సంస్థలోనే పనిచేయాల్సిన దుస్థితి దాపరించిందని చెప్పారు. ప్రభుత్వమే ఈ సంస్థ నిర్వహించాలని కోరారు. కాంట్రాక్టు సంస్థ మారినప్పుడల్లా కార్మికులను తొలగించటం బెదిరించటం ఆపాలని కోరారు .సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం రమేష్ మాట్లాడుతూ 108 ఉద్యోగులు ప్రజానీకానికి ఎంతో సేవ చేస్తా ఉంటే వీరి యొక్క సేవలను గుర్తించకుండా చిన్నచిన్న కారణాలతోటి తొలగించడం జీతాలు ఆపటం చేస్తా ఉందని దీన్ని ఆపాలలని కోరారు. యూనియన్ నాయకురాలు సిహెచ్ స్వర్ణ మాట్లాడుతూ పనిచేసే ప్రాంతంలో హాస్పిటల్స్ లో ఎలాంటి సౌకర్యాలు లేక ఇబ్బందులకు గురవుతున్న పరిస్థితి కూడా ఉన్నదని కనుక 108 సిబ్బంది డ్యూటీ లో ఉండటానికి కనీస వసతులతో కూడిన రూములను కేటాయించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా సక్రమంగా వాహనాలు మరమ్మతులుచేయించనందు వల్ల ప్రమాదాలు కూడా జరుగుతా ఉన్నాయి.ఉధ్యోగులు భయంతో ఉధ్యోగాలు చేయాల్సివస్తుందని అన్నారు.

ఈ ప్రమాదాలలో 108 ఉద్యోగులు చనిపోవడం, గాయపడటం జరుగుతా ఉంది. వీరికి ప్రభుత్వం వైపు నుంచి కానీ అరవింద యాజమాన్యం వైపు నుంచి గాని ఎలాంటి రక్షణ లేదని చెప్పారు. చనిపోయిన కార్మికులకు 25 చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ల సాధన కోసం ఎంతటి పోరాడానికైనా సిద్ధంగా ఉన్నామని చెప్పారు .ఈ రిలే నిరాహార దీక్షలకు సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు చీకటి శ్రీనివాసరావు ,జిల్లా కార్యదర్శులు బంకా సుబ్బారావు ,టి మహేష్ మద్దతు తెలియజేశారు .

ఈ దీక్షలో దీక్షలకు 108 ఉద్యోగుల యూనియన్ అధ్యక్షులు మస్తాన్ వలి, వర్కింగ్ ప్రెసిడెంట్ భాస్కరు, రాష్ట్ర నాయకురాలు సిహెచ్ స్వర్ణ ,రత్నకుమారి ఒంగోలు డివిజన్ అధ్యక్షులు బి భాస్కర నాగరాజు, గంగాధరు ,మార్కాపురం అధ్యక్షులు చెన్నకేశవులు, కనిగిరి డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు మస్తాన్ భాష గురవయ్య ,పొదిలి డివిజన్ అధ్యక్షులు మహబూబ్ బాషా తదితరులు నాయకత్వం వహించారు. జిల్లాలోని అన్ని మండల 108 ఉద్యోగులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రకాశం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నుండి నెల్లూరు బస్టాండ్ వరకు మీదగా చర్చి సెంటర్ మీదగా కలెక్టర్ కార్యాలయం వరకు నినాదాలు ఇచ్చుకుంటూ ప్రదర్శన చేశారు.

# కనీస పెన్షన్ రూ.9 వేలు చెల్లించాలని కోరుతూ పెన్షన్ విద్రోహదినం



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, నవంబర్ 18)

కనీస పెన్షన్ రూ.9 వేలు డిఏతో కలిపి ప్రకటించాలని ఆల్ పెన్షనర్స్, రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ప్రకాశం జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి జి శేషయ్య, సిహెచ్ రాంబాబులు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఒంగోలు కలెక్టరేట్ ఎదుట సోమవారం పెన్షన్ విద్రోహ దినం పాటించారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి సీహెచ్ రాంబాబు మాట్లాడుతూ ఈపీఎఫ్ పెన్షన్ దారులకు ప్రతినెల పెన్షన్‌గా రూ.1,000 ల నుండి రూ.3,000లు మాత్రమే పొందుతున్నారని, ఇది చాలా అమానుషమైనదన్నారు. ముఖ్యవక్తగా హాజరు అయిన సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి శ్రీనివాసులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పెన్షనర్ల ఉద్యోగ వ్యతిరేక విధానాలను ఎండగట్టారు. ఇంకా ఏపీఆర్‌పీఏ నాయకులు టీవీఆర్ సుబ్బారావు, బీవీ రావు, ఎస్ సంపత్ కుమారి, ఏ రాఘవులు, టి నారాయణ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పెన్షన్ దార్లకు రావలసిన రాయితీలను, బకాయిలను వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. శిభిరాన్ని ఉద్దేశించి సీఐటీయూ జిల్లాశాఖ అధ్యక్షులు కాలం సుబ్బారావు, రైతుసంఘం నాయకులు చుండూరి రంగారావు సందేశాలు ఇచ్చారు. ఇంకా సింగరాజు శ్రీనివాసరావు, దామరాజు నాగేశ్వరరావు, ఎం శ్రీనివాసరావు, ఐవి ఆంజనేయులు, ఎస్ నరసింహారావు, డి నారాయణ, జి శ్రీరామమూర్తి, జి నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.

# కబడ్డీలో సత్తా చాటిన వాసవి విద్యార్థులు



(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, నవంబర్ 18)

స్థానిక మార్కాపురంలోని వాసవి విద్యానికేతన్ విద్యార్థులు కబడ్డీ ఆటలో సత్తా చాటారు. నగరంలోని సుభాష్ చంద్రబోస్ కబడ్డీ క్లబ్ వారు నిర్వహించిన స్కూల్ స్థాయి కబడ్డీ టోర్నమెంట్ లో వాసవి విద్యానికేతన్ విద్యార్థులు రన్నర్లుగా నిలచి ద్వితీయ స్థానం పొంది బహుమతిని గెల్చుకున్నారు. చదువుతో పాటు ఆటలలో కూడా రాణిస్తున్నందుకు విద్యార్థులను ప్రిన్సిపల్, డైరెక్టర్ కే రంగయ్య, ఏఓ రంజిత్ కుమార్ అభినందించారు. ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు హర్షం వ్యక్తపరచి విద్యార్థులను మెచ్చుకున్నారు.

# మాజీ సీఎం జగన్‌ను కలిసిన లింగంగుంట్ల ప్రసాద్



(షణ్ముఖ వెలుగు, పుల్లలచెరువు, నవంబర్ 18)

మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డిని తాడేపల్లిలోని కేంద్ర కార్యాలయంలో సోమవారం యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు లింగంగుంట్ల ప్రసాద్ మర్యాద పూర్వకంగా కలిసారు.

# పేద విద్యార్థికి ఆర్థిక సాయం అందజేసిన మాదిగ ఉద్యోగుల సంఘం



(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, నవంబర్ 18)

మార్కాపురం పట్టణానికి చెందిన తంగిరాల సౌమ్య తండ్రి చిట్టిబాబు అనే పేద విద్యార్థిని చదువులో రాణిస్తూ పద్మావతి యూనివర్సిటీలో లా కోర్సులో ఫ్రీ సీటు సాధించి చదువుకొనుటకు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు, ఇతరుల ద్వారా మాదిగ ఉద్యోగుల సంఘానికి తెలియడంతో వెంటనే స్పందించిన మాదిగ ఉద్యోగుల సంఘం, నాయకులు విద్యార్థినికి రూ.10,000 ఆర్థిక సహాయం అందజేశారు.

ఈ కార్యక్రమంలో మాదిగల ఉద్యోగ సంఘం (ఎంఈఎఫ్) జిల్లా వైస్ ప్రెసిడెంట్ బీ. జీవరత్నం మరియు మార్కాపురం అధ్యక్షుడు ఏలియా, సెక్రటరీ సంజీవ్, కోశాధికారి ప్రసాద్, ఉద్యోగ సంఘం నాయకులు సిఎస్ కుమార్, ఫిలిప్, బర్నబాస్, చార్లెస్, మహాజన సోషలిస్టు రాష్ట్ర నాయకులు పందిటి కాశీ రావు మాదిగ, తదితరులు పాల్గొన్నారు.

# ఆశా వర్కర్స్ సమస్యలపై ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలను అమలు చేయాలి

## ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా ప్రధాన కార్యదర్శి పి కల్పన



ఫోటో నెం. 34, 35

(షణ్ముఖ వెలుగు , ఒంగోలు, నవంబర్ 18)

ఆశా వర్కర్స్ సమస్యలపై ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలను వెంటనే అమలు చేయాలని ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా ప్రధాన కార్యదర్శి పి. కల్పన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆశా వర్కర్స్ సమస్యలపై సోమవారం జిల్లా కలెక్టరేట్ వద్ద ఎం బాలమ్మ అధ్యక్షతన ధర్నా జరిగింది. ఈ ధర్నాలో కల్పన మాట్లాడుతూ ఆశావర్కర్ల సమస్యలపై ప్రభుత్వం ఒప్పందం చేసుకొని 9 నెలలు గడుస్తున్నా నేటికి అమలు చేయలేదన్నారు.ఆన్ లైన్ వర్క్‌తో పనిభారం విపరీతంగా పెరిగిందన్నారు. ఆశాలకు సంబంధంలేని డ్యూటీలు చేయిస్తున్న వైద్యాధికారులుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. వేతనాలతో కూడిన సెలవులు, మెటర్నిటీ లీవ్ సౌకర్యం కల్పించాలన్నారు. రిటైర్మెంట్ వయో పరిమితిని 62 సంవత్సరాలకు పెంచాలన్నారు.సిఐటియు జిల్లా ప్రధానకార్యదర్శి యం.రమేష్ మాట్లాడుతూ రెగ్యులర్ పే స్కేల్ వర్తించని కార్మికులకు ప్రతి 2 సంవత్సరాలకు వేతనాలు పెంచాల్సిన ప్రభుత్వాలు 5 సంవత్సరాలు దాటిన వేతనాలు పెంపుపై దృష్టి పెట్టటం లేదన్నారు. కనీస వేతనాలు అమలు చేయకపోగా సంక్షేమ పథకాలకూ ఆశా కుటుంబాలను మినహాయించటం దారుణమన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ అమలుచెరడంతోపాటు కనీస పెన్షన్ 9000 వేల రూపాయలు ఇవ్వాలన్నారు.ఆశావర్కర్స్ సమస్యలు పరిష్కరించకుంటే ఎలాంటి పోరాటానికి ఐనా సిద్ధం కావాలన్నారు.ఈ ధర్నాలో సిఐటియు జిల్లా అధ్యక్షులు కాలం సుబ్బారావు, జిల్లా నాయకులు చీకటి శ్రీనివాసరావు, జి.శ్రీనివాసులు, టి.మహేష్,బి.సుబ్బారావు, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు యం.పరిశుద్ధం,అరుణ, అన్నపూర్ణ,పుల్లమ్మ, సుశీల,పద్మ, వెంకాయమ్మలు పాల్గొన్నారు.



# టైలర్స్ కాలనీ ముస్లింల స్మశాన వాటికను కాపాడండి

(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, నవంబర్ 18)

నెల్లూరు రూరల్ టైలర్స్ కాలనీను ముస్లిమ్స్ స్మశాన వాటికకు ప్రభుత్వం ఐదున్నర ఎకరాలు కేటాయించిన ప్రస్తుతానికి మూడున్నర ఎకరాల్లో మాత్రమే స్మశానం వాటిక ఉందని మిగతా రెండు ఎకరాల ఆక్రమించబడినది రోడ్డుకి వదిలిన భూమిని అక్రమదారుడు అక్రమించుకొని వివిధ రకాలైన నిర్మాణాలను చేశారని నెల్లూరు జిల్లా లోని కలెక్టర్ కార్యాలయంలో మీకోసం కార్యక్రమంలో పాల్గొని కలెక్టర్ కి ముస్లిం ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు మమ్మద్ జియాద్వీపం జరిగింది ఇచ్చిన వెంటనే సమస్యని పరిష్కరించమని సంబంధిత అధికారులకు ఆదేశాలు చేశారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు శేఖర్ బాషా నెల్లూరు జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనార్టీ అధ్యక్షులు షేక్ అల్లావుద్దీ, షేక్ ఆసిఫ్ భాష , షేక్ అహ్మదుల్లా తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ముస్లిం ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ ఫుల్ హాక్ మాట్లాడుతూ గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం నెల్లూరు రూరల్‌లోని రామకోటి నగర్ టైలర్స్ కాలనీ లో 5.5 ఎకరాలు ముస్లిం స్మశాన వాటికకు కేటాయించింది అయితే అందులో మూడున్నర ఎకరాలు మాత్రమే స్మశానానికి వాడుకున్నామని మిగతా రెండు ఎకరాలు అక్రమ దారుల వల్ల అక్రమింపబడినది ఆ స్థలము తిరిగి ముస్లిం స్మశాన వాటికి కేటాయించవలసిందిగా చెబుతున్నామని వాళ్ళు చెప్పారు. సమస్యను కలెక్టర్ దగ్గరికి తీసుకు వచ్చామని వెంటనే దీనికి పరిష్కారము ఇస్తారని కోరుకుంటున్నామని అని వాళ్ళు తెలిపారు.





# ఎపిటిసిఎ ఒంగోలు నూతన అధ్యక్షురాలు లక్ష్మీకి అభినందనలు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, నవంబర్ 18)

నాయకత్వం అనేది కేవలం అధికారంగా కాకుండా బాధ్యతాయుతంగా ఉండాలని ఏపీటీసీఏ పట్టణ పూర్వ అధ్యక్షులు గేరా అజయ్ కుమార్ అన్నారు. చందమామ శ్రీవాణి పబ్లిక్ స్కూల్ నందు జరిగిన అభినందన కార్యక్రమంలో గేరా అజయ్ కుమార్ మాట్లాడుతూ ఒంగోలు పట్టణ అధ్యక్షురాలు లక్ష్మీని అభినందిస్తూ స్త్రీల యొక్క నాయకత్వం ఎంతో ఆదర్శప్రాయమని ఎంతో చరిత్ర కలిగిన ఎ పి టి సి ఎ సంఘానికి మొదటి మహిళా అధ్యక్షురాలుగా ఒక స్త్రీ ఎన్నికవటం గర్వించదగిన అంశమని అది కేవలం బాధ్యతగా ఉండి అందరిని కలుపుకొని అసోసియేషన్ యొక్క అభివృద్ధికి, అలాగే విద్య వ్యవస్థలో సంస్కరణలు తీసుకురావడానికి ఉపయోగపడే నాయకత్వం గా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అపెక్స్ హైస్కూల్ కరస్పాండెంట్ శివకోటిరెడ్డి మాట్లాడుతూ ఉమెన్ ఎంపవరమెంట్ గా ప్రస్తుత లోకం ఎంతో ముందుకు కొనసాగుతుందని అలాగే ఒంగోలు పట్టణ ఎపిటిసిఎ అధ్యక్షురాలుగా లక్ష్మీ ఎన్నుకోవడం చాలా సంతోషకరమని ఆమె నాయకత్వంలో విద్యావ్యవస్థలో విద్యార్థులకు, పాఠశాలలకు మేలు జరగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎ పి టి సి ఎ జిల్లా నాయకులు, పట్టణ నాయకులు పాల్గొని ఈవియస్ లక్ష్మీని అభినందించారు.

# ముంబై అమెజాన్ కంపెనీకి 'శ్రీ హర్షిణి' విద్యార్థి ఎంపిక

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, నవంబర్ 18)



అమెజాన్ కంపెనీలో జరిగిన ప్రాంగణ ఎంపికలలో ఒంగోలు శ్రీహర్షిణి డిగ్రీ కాలేజీ విద్యార్థి ఏ.హరి హర కుమార్ ముంబై అమెజాన్ కంపెనీలో 9 లక్షల ప్యాకేజీతో ఎంపిక కాబడ్డాడు.ఈ సందర్భాన్ని పురస్కరించుకుని శ్రీ హర్షిణి విద్యాసంస్థల చైర్మన్ శ్రీ గోరంట్ల రవికుమార్ మాట్లాడుతూ డిగ్రీతో పాటు విద్యార్థులకు ఎనలటికల్ స్కిల్స్ మరియు కమ్యూనికేషన్ స్కిల్స్ ట్రైనింగ్ తో పాటు క్యాంపస్ ప్లేస్మెంట్స్ కల్పిస్తున్న ఏకైక విద్యా సంస్థ శ్రీ హర్షిణి అని తెలియజేశారు. ఈ సంవత్సరం ఇప్పటివరకు 800 మంది విద్యార్థులకు ఉద్యోగాలు ఇవ్వడం జరిగింది అని తెలియజేశారు. ఇంకా ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ గోరంట్ల కవిత, డీన్ దాది ఆంజనేయులు, పీజీ కోఆర్డినేటర్ శ్రీనివాసులు రెడ్డి, ఏవో ర్యాంకర్స్ శ్రీనివాసరావు, క్యాంపస్ ఇంచార్జ్ ధీరేష్ , ఇతర అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది పాల్గొని విద్యార్థికి అభినందనలు తెలియజేశారు.

# నిరుపేదలకు నివేశిత స్థలాలు వెంటనే ఇవ్వాలి

## పట్టణ ప్రాంతంలో రెండు సెంట్లు భూమితో పాటు ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలి

## సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం ఎల్ నారాయణ డిమాండ్

## సిపిఐ ఆధ్వర్యంలో అర్జీదారులతో మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా








(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, నవంబర్ 18)

ఎన్నికలకు ముందు ఎన్డీఏ కూటమి ఇచ్చిన హామీ మేరకు పట్టణ ప్రాంతంలో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతంలో మూడు సీట్లు చొప్పున ఇల్లు లేని పేదలకు నివేశిత స్థలాలు వెంటనే ఇవ్వాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ డిమాండ్ చేశారు. సిపిఐ రాష్ట్ర సమితి పిలుపుమేరకు సిపిఐ ఒంగోలు నగర సమితి ఆధ్వర్యంలో పేదలతో మున్సిపల్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎం ఎల్ నారాయణ మాట్లాడుతూ గత ప్రభుత్వం ఒంగోలు నగరంలో పేదలకు 30 వేల మందికి ఇళ్ల స్థలాలు అంటూ ఎన్నికల ముందు ఆర్భాటం చేసి కాయితాలను ప్రజలు చేతుల్లో పెట్టిందన్నారు. అయితే ఆ స్థలం ఎక్కడ ఉంది, ఎంత ఉంది అనే విషయం స్పష్టత లేదన్నారు. దీంతో లబ్ధిదారులు ఏం చేయాలో పాలుపోని స్థితిలో ఉన్నారన్నారు. అలాగే గత టిడిపి పాలన హయాంలో టిట్కో గృహాలు 80% నిర్మించినప్పటికీ వాటిని పూర్తి చేసి లబ్ధిదారులకు అందించడంలో విఫలమైందన్నారు. గత జగన్ ప్రభుత్వం టిట్కో గృహాల పట్ల నిర్లక్ష్య వైఖరి అవలంబించింది అన్నారు. దీంతో ఒంగోలు పట్టణంలో నివసించే పేదలు అద్దెలు చెల్లించలేక, పిల్లల చదువులు చదివించుకోలేక, పెరిగిన నిత్యవసర వస్తువుల ధరలతో కుటుంబాలను నడిపేందుకు నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం వెంటనే ఒంగోలు నగర పరిధిలో 2 సెంట్లు నివేశిత స్థలంతో పాటు ఇంటి నిర్మాణానికి రూ. 5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఈ సందర్భంగా ఒంగోలు దగ్గర మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు ని కలిసి అర్జీలు అందజేశారు. కార్యక్రమానికి ముందుగా స్థానిక మల్లయ్య లింగం భవన్ నుండి మున్సిపల్ కార్యాలయం వరకు అర్జీ దారులతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఒంగోలు నగర సమితి నాయకులు కొత్తకోట వెంకటేశ్వర్లు, శ్రీరామ్ శ్రీనివాసులు, ఉప్పుటూరి ప్రకాశరావు, ఎస్ డి సర్దార్, అంజయ్య, ఎస్ టి యు నాయకులు సిహెచ్ ఆదినారాయణ, సిహెచ్ వెంకటేశ్వర్లు, వెంకట్రావు, ఇన్సాఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎంఎస్ సలార్, అబ్దుల్ సత్తార్, ఫేక్ కాసిం, షేక్ షఫీ తోపాటుగా 300 మంది మహిళలు పాల్గొన్నారు.

# జైపూర్‌లో హౌస్ కమిటీ సమావేశంలో పాల్గొన్న ఎంపి మాగుంట





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, నవంబర్ 18)

రాజస్థాన్ రాష్ట్ర రాజధాని జైపూర్‌లో గృహ, పట్టణ వ్యవహారాల పార్లమెంటరీ కమిటీ చైర్మన్, ఒంగోలు పార్లమెంటు సభ్యులు, మాగుంట శ్రీనివాసులురెడ్డి రాష్ట్ర అధికారులు, కమిటీ సభ్యులతో గృహ, పట్టణ వ్యవహారాల పై సోమవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో గృహ , పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, ఆర్థిక శాఖ, మునిసిపల్ శాఖ, జైపూర్ మెట్రో, హెచ్‌యుడీసీ, సీపీడబ్ల్యూడీ, ఎన్‌బీసీసీ, ఎన్‌హెచ్‌బీ బ్యాంక్ ఆఫ్ బరోడా, పంజాబ్ నేషనల్ బ్యాంక్ అధికారులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో గృహ, పట్టణ వ్యవహారాలకు సంబంధించి అధికారులతో చర్చలు జరిపి వారు చేసిన సూచనలపై సంబంధిత కేంద్ర నాయకులతో చర్చించి తగిన చర్యలు తీసుకుంటానని మాగుంట శ్రీనివాసులురెడ్డి వారికి తెలిపారు.

# మిట్టపాలెం నారాయణస్వామి వారిని దర్శించుకున్న దేవాదాయ ధర్మాదయ శాఖ సహాయ కమిషనర్





(షణ్ముఖ వెలుగు, పామూరు, నవంబర్ 18)

సిఎస్‌పురం మండలంలోని మిట్టపాలెం నందు ప్రముఖ పుణ్యక్షేత్రమైన నారాయణస్వామి ఆలయానికి ఆదివారం రూ.2,27,483 ఆదాయం వచ్చినట్టు కార్య నిర్వహణ అధికారి గిరి రాజు నరసింహ బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు స్వామి వారి దర్శన టికెట్లు అమ్మకం ద్వారా రూ.1,27,400 స్వామివారి లడ్డు ప్రసాదం అమ్మకం ద్వారా రూ.37,570 స్వామివారి ఆలయం వద్ద నిర్వహిస్తున్న శాశ్వత అన్నదానం పథకం నిర్వహణకు దాతలు ఇచ్చిన విరాళం రూ.54,013 పంచ అమృత అభిషేకము నిర్వహణకు , ఇతర విరాళాలు రూ.8,500 వచ్చినట్లు తెలిపారు శ్రీ నారాయణ స్వామి వారిని ప్రకాశం జిల్లా దేవదాయ ధర్మాదాయ శాఖ సహాయ కమిషనర్ యం. పానకాల రావు దర్శించుకొన్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి తదుపరి శ్రీ స్వామి వారి శేష వస్త్రములతో సత్కరించి వేద ఆస్వీదరచనం ఇచ్చి తీర్థ ప్రసాదాలు అందజేశారు. తదుపరి వారు ఉచిత అన్నదాన కార్యక్రమములో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్స్పెక్టర్ జి.ఏ.సత్య నారాయణ, కొమ్మినేని వెంకటరావు , ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

# దారపనేని విన్నపంతో గంగమ్మ గుడికి రూ.3,01,116ల గంగమ్మ గుడికి వడ్లమూడి విరాళం



(షణ్ముఖ వెలుగు, పామూరు, నవంబర్ 18)

పామూరు మండలం తూర్పు కోడిగుడ్లపాడు పంచాయతీ పరిధిలోని నక్కలగండి ప్రాజెక్టు దగ్గర నూతనంగా నిర్మిస్తున్న గంగమ్మ దేవస్థానానికి కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్ విన్నపం మేరకు ప్రముఖ వ్యాపారవేత్త వడ్లమూడి నాగేంద్ర 3 లక్షల 1,116 రూపాయల చెక్కును విరాళంగా సోమవారం నుచ్చు పొద గ్రామంలోని శ్రీ లక్ష్మీ బాలాజీ స్టోన్ క్రషర్ ఆవరణలో అందజేశారు. ఈ సందర్భంగా గంగమ్మ దేవస్థానం నిర్వాహకులు తూర్పు కోడిగుడ్లపాడు మాజీ ఎంపీటీసీ చెనికల పెదమాల కొండయ్య, చెనికల పెదమాల కొండయ్య (పెద్దాయన) మాజీ సర్పంచ్ మానం గురవయ్య, బొడ్డు వెంకటేశ్వరరావు, మానం వెంగళరావు, చెనికల రవి, మానం వెంగయ్య, చెనికల వెంకటరత్నం, చెనికల వెంగళరావు, పాముల రమణయ్య తదితరులు వడ్లమూడి నాగేంద్రకు కృతజ్ఞతలు తెలిపారు.

# బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలి

## చిన్నారుల మృతదేహాలతో కలెక్టరేట్ ఎదుట మృతుల సమీప బంధువుల ఆందోళన







(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, నవంబర్ 18)

రోడ్డు ప్రమాదంలో మగ్గురు కుమారులను పోగొట్టుకున్న కుటుంబాలకు ప్రభుత్వం న్యాయం చేయాలంటూ మృతుల సమీప బంధువులు చిన్నారుల మృతదేహాలతో కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. కొప్పోలులో నీళ్ళ ట్యాంకర్ ఢీకొన్న సంఘటనలో ద్విచక్రవాహనంపై వెళుతున్న విద్యార్థులు రేష్మంత్, వడ్డే వికాష్, వడ్డే అశ్వనీకుమార్ ప్రాణాలు కోల్పోయారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను కుటుంబసభ్యులకు అందజేశారు. ప్రమాద సంఘటనలో ముగ్గురు చిన్నారులు ప్రాణాలు కోల్పోయి రెండు కుటుంబాలు ఆశలు ఆవిరయ్యాయి. పిల్లలే ప్రాణంగా పెట్టుకొని జీవిస్తున్న ఓ తల్లి అనాధగా మిగిలింది. ఇంత జరిగినా ప్రభుత్వం అధికారులుకానీ, ప్రజాప్రతినిధులు కానీ స్పందించకపోవటంతో బాధిత కుటుంబ సభ్యులు, గ్రామస్థులు మృతదేహాలతో కలెక్టర్ గేటు ముందు బైఠాయించి బాధిత కుటుంబాలకు తక్షణ సహాయం చేసి ప్రభుత్వం ఆదుకోవాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అక్కడకు చేరుకున్న ఒంగోలు పట్టణ డిఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పోలీసులు ఆందోళన చేస్తున్న బాధిత కుటుంబ సభ్యులకు నచ్చచెప్పే ప్రయత్నం చేశారు. అయినా వారు ప్రభుత్వం తరఫున స్పష్టమైన హామీ ఇస్తే తప్ప ఇక్కడి నుంచి వెళ్ళేది లేదని బీష్మించారు. ప్రభుత్వం అన్నివిధాలుగా ఆదుకునేలా చర్యలు తీసుకుంటుందని ఇలా ఆందోళన చేయటం వల్ల ప్రజలకు ఇబ్బందులు తలెత్తుతాయని నచ్చజెప్పినా వినలేదు. సంఘటన విషయం తెలుసుకున్న డి.ఆర్.ఒ. చిన ఓబులేసు బాధిత కుటుంబాల వద్దకు చేరుకొని సంఘటన వివరాలు తెలుసుకున్నారు. జరిగిన సంఘటన చాలా బాధాకరమని పిల్లలను తిరిగి ఇవ్వలేమని, ప్రభుత్వ పరంగా బాధిత కుటుంబాలకు ఎంతమేర న్యాయం చేయగలమో అంతమేర న్యాయం చేస్తామని తెలిపారు. ప్రమాద సంఘటన విషయం తెలుసుకున్న కలెక్టర్ మీ వద్దకు పంపించారని తెలిపారు. క్షేత్రస్థాయి అధికారుల నుంచి నివేదికలు తెప్పించుకొని సంఘటనపై ప్రభుత్వానికి నివేదిక పంపించటం జరుగుతుందన్నారు. తప్పకుండా ప్రభుత్వ పరంగా ఎంతమేర న్యాయం చేయగలమో అన్నివిధాలుగా బాధిత కుటుంబాలను ఆదుకుంటామన్నారు. ప్రమాద సంఘటనపై సకాలంలో మండల స్థాయి అధికారులు స్పందించకపోవటం వల్లే బాధిత కుటుంబాల్లో అనుమానాలు తలెత్తాయని దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు నీలం నాగేంద్రరావు డిఆర్‌ఒకు తెలిపారు. చెప్పిన విధంగా ప్రభుత్వపరంగా న్యాయం చేసి బాధిత కుటుంబాలను ఆదుకోవాలన్నారు. డి.ఆర్.ఒ. ఇచ్చిన హామీతో కుటుంబ సభ్యులు మృతదేహాలను కొప్పోలుకు తరలించారు.

# యర్రగొండపాలెం గ్రంథాలయంలో విద్యార్థులకు క్విజ్ పోటీలు





(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం టౌన్, నవంబర్ 18)

మండల కేంద్రమైన యర్రగొండపాలెం గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా పాఠశాల విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఎంఈఓ ఆంజనేయులు ఉపాధ్యాయులు సురేష్ సునంద సక్కుబాయి అబ్దుల్లా ఈ స్కూల్లో నుండి 17 టీమ్స్ నుంచి మొత్తం 64 మంది విద్యార్థులు పాల్గొన్నారు. క్విజ్ పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేసారని గ్రంథాలయ పాలకుడు కె ఝాన్సీ తెలిపారు.

# భైరవకోనని సందర్శించిన కనిగిరి బ్రాహ్మణ సంఘం నాయకులు







(షణ్ముఖ వెలుగు, సీఎస్‌పురం, నవంబర్ 18)

కార్తీక సోమవారం సందర్భంగా చంద్రశేఖరపురం మండలంలోని భైరవకోనను కనిగిరి తాలూకా బ్రాహ్మణ సంఘం నాయకులు ధూళిపాళ్ల వీరభద్రయ్య, ధూళిపాళ్ల మల్లికార్జునరావు బ్రాహ్మణ సంఘం రాష్ట్ర కార్యదర్శి సంగరాజు సాయి మనోజ్ , ధూళిపాళ్ల వివేకానంద సందర్శించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారికి ,దేవస్థాన ఆలయ ఈవో వంశీ కృష్ణారెడ్డి అర్చకులు ఘనంగా సత్కరించారు.

# బంగారు బాల్యాన్ని సంరక్షించాలి

## - బాలల హక్కులను కాపాడాలి - తహసిల్దార్ కెవి రమణరావు

(షణ్ముఖ వెలుగు, పామూరు, నవంబర్ 18)

నేటి బాలలే రేపటి మన దేశ భవిష్యత్తు బంగారు బాల్యం విలువైనది అని అది బాలల ఉజ్జల భవిష్యత్తుకు నాంది కావాలి అని ,విద్య ప్రతి ఒక్కరికి చేరాలని బాలల హక్కుల ను కాపడవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తహసిల్దార్ కెవి రమణారావు అన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశాల మేరకు పామూరు గ్రామపంచాయతీలో పంచాయతీ కార్యదర్శి జివి అరవింద అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. బంగారు బాల్యం గ్రామ కమిటీ 12మంది తో ఏర్పాటు చేసినారు. తండ్రి గాని తల్లి గాని ఎవరో ఒకరు ఉన్న పిల్లలు దర్ఘా కాలిక వ్యాధులతో బాధపడుతున్న వారరు అనాధ పిల్లలు హెచ్ఐవి వ్యాధితో బాధపడుతున్న వారిని గుర్తించాలని కోరారు. స్వయంకృషి సేవా సంస్థ డాక్టర్ షేక్ నాయబ్ రసూల్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బంగారు బాల్యాన్ని సంరక్షించాలన్నారు. బాల్య వివాహాలు ఎక్కువగా అబ్బాయిల కంటే ఆడపిల్లల్లోనే జరుగుతున్నాయని అన్నారు. బాల్య వివాహాలు జరగకుండా ప్రతి ఒక్కరు కూడా కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీస్ గాయత్రి, ఏఎన్ఎంలు సునీత, మౌనిక, అంగన్వాడి కార్యకర్త వాణి, సచివాల సిబ్బంది, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





# ఎంపీడీవో శ్రీనివాస్‌ను ఘనంగా సత్కరించిన శ్రీకృష్ణ సేవా సమితి ప్రతినిధులు



(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, నవంబర్ 18)

మార్కాపురం మండల ఎంపీడీవో శ్రీనివాసులును సోమవారం శ్రీకృష్ణ సేవా సమితి ప్రతినిధులు ఎంపీడీవో కార్యాలయం నందు మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్చాలతో దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అడక రాజగోపాల్ కడియం అల్లూరయ్య, గుమ్మ బాలనాగయ్య , సుబ్బారాయుడు, కాయకాకుల వెంకటేశ్వర్లు, కాటం వెంకటరమణ, కాలంగి వెంకటేశ్వర్లు, ఎర్ర గొర్ల విష్ణువర్ధన్, శ్రీరాములు, గుమ్మా రాజశేఖర్ , సత్యనారాయణ,గోసు సుబ్బారావు, లక్ష్మీనారాయణ లు పాల్గొన్నారు.

## భైరవేశ్వరుని దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన ఏఎంసి యారవ

(షణ్ముఖ వెలుగు, పామూరు, నవంబర్ 18)



సిఎస్‌పురం మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం పర్యటక కేంద్రం అయిన భైరవకోనలో త్రిముఖ దుర్గాంబ దేవి భైరవేశ్వరుని ఆలయంలో కనిగిరి నియోజకవర్గ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ యారవ శ్రీనివాసులు సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ మార్కెట్ చైర్మన్ యారవ శ్రీనివాసులకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి శేష వస్త్రంతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, మిత్రులు పాల్గొన్నారు.

## తాళ్ళూరి కుటుంబ సభ్యులను పరామర్శించిన ఆదాల





(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, నవంబర్ 18)

మాజీ ఏపీ స్టేట్ మార్క్ ఫెడ్ డైరెక్టర్ తాళ్ళూరి రామణయ్య నాయుడు ఇటీవల మరణించారు. ఈ నేపథ్యంలో సోమవారం దగదర్తి గ్రామంలో అయన చిత్రపటానికి పూలమాలవేసి నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పరిశీలకులు ఆదాల ప్రభాకర్ రెడ్డి నివాళ్లు అర్పించి వారి కుటుంబ సభ్యులు దగదర్తి మండలం ఎంపీపీ తాళ్ళూరి ప్రసాద్ నాయుడు, రవి ప్రసాద్ నాయుడు తదితరులను పరామర్శించారు. తాళ్లూరి కుటుంబ సభ్యులను పరామర్శించి వారిలో విజయ డైరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి , నెల్లూరు జిల్లా మార్కెటింగ్ కమిటీ మాజీ చైర్మన్ వీరి చలపతి, మల్లు సుధాకర్ రెడ్డి, స్వర్ణ వెంకయ్య, పాశం శ్రీనివాసులు, శ్రీకాంత్ రెడ్డి, నరసింహరావు, బెల్లంకొండ వెంకయ్య, అల్లాభక్షు, నాని తదితరులు పాల్గొన్నారు

## కుంభాల కుటుంబాన్ని పరామర్శించిన నేదురుమల్లి రామ్ కుమార్‌రెడ్డి





(షణ్ముఖ వెలుగు, తిరుపతి, నవంబర్ 18)

వాకాడు మండల వాకాడు గ్రామపంచాయతీలోని హరిజనవాడలో నేదురుమల్లి కుటుంబీకుల అభిమాని సీనియర్ నాయకులు కుంభాల మస్తానయ్య మరణించారు. విషయం తెలుసుకొని వారి ఇంటికి వెళ్లి వారి యొక్క పార్థవదేహానికి వెంకటగిరి వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్ కుమార్‌రెడ్డి పూలమాలేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారి వెంట వాకాడు మండల నాయుకులు, కార్యకర్తలు ఉన్నారు.

## కోలా వారి వివాహ మహోత్సవంలో వైసీపీ ఇంచార్జి దద్దాల

(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, నవంబర్ 18)

కనిగిరి మండలం దిరిశవంచ పంచాయతీ కమ్మవారిపల్లి గ్రామానికి చెందిన కోలా విలియం , కొండమ్మల కుమారుడు కోలా రుబియదాస్ వివాహ మహోత్సవంలో పాల్గొని నూతన వరుడిని ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు కనిగిరి వైసీపీ ఇంచార్జి దద్దాల నారాయణ యాదవ్. ఈ కార్యక్రమంలో కనిగిరి జడ్పీటీసీ మడతల కస్తూరి రెడ్డి, ఎంపీపీ దంతులూరి ప్రకాశం,సర్పంచ్ గుంటూరి వెంకటేశ్వర్లు, గుంటూరి రమేష్,కోలా విలియం, కోలా చంటి,కోలా యోహాన్,కోలా రవీంద్ర బాబు,కోలా ఏసురత్నం,కోలా మోసే,ఎస్సీ నాయకులు కటికల వెంకటరత్నం, గాండ్లపర్తి ఆదినారాయణ రెడ్డి, గుడిపాటిపల్లి ఎంపీటీసీ నాగేశ్వరావు, నాగిరెడ్డిపల్లి సర్పంచ్ సైకం ఏడుకొండలు రెడ్డి, మాజీ సర్పంచ్ గొబ్బిళ్ల శ్రీను, రమేష్, తదితరులు పాల్గొన్నారు.



## పొదిలి నగర పంచాయితీలో తొలగించిన ఆక్రమణల స్థానంలో మురుగునీరు వెళ్ళేలా కాలువలు నిర్మించాలి

### సిపిఎం పొదిలి ప్రాంతీయ కమిటి కన్వీనర్ పి బాలనర్సయ్య

(షణ్ముఖ వెలుగు, పొదిలి, నవంబర్ 18)

పొదిలి నగర పంచాయితీలో తొలగించిన ఆక్రమణల స్థానంలో మురుగునీరు వెళ్ళేలా కాలువలు నిర్మించాలని కోరుతూ నవంబర్ 20న పొదిలి నగర పంచాయితీ ఆఫీసు వద్ద ధర్నాను జయప్రదం చేయాలని సిపిఎం పొదిలి ప్రాంతీయ కమిటి కన్వీనర్ పి.బాలనర్సయ్య ఒక ప్రకటనలో కోరారు. పొదిలి పట్టణంలో మురుగునీటి కాలువలు లేకపోవడం,ఉన్న కొద్ది పాటి కాలువలు పూడిపోయి మురుగునీరు నిలిచి దుర్గంధం వెదజల్లుతుందన్నారు. చిన్నపాటి వర్షానికి రోడ్లపై నీరు నిలిచి చెరువులను తలపిస్తున్నాయన్నారు. ఈ స్థితిలో మురుగు కాలువలుపై ఆక్రమణల తొలగించి మురుగునీరు నిల్వ ఉండకుండా కాలువలు నిర్మించాల్సిన ప్రభుత్వం అధికారులు ఆక్రమణల తొలగింపులో సరిపెట్టుకోవడం వ్యాపారస్తులు,చిరు వ్యాపారులకు శాపంగా మారిందన్నారు.వ్యాపారాలు దెబ్బతిని అద్దెలు చెల్లించలేని స్థితికి నెట్టబడ్డారన్నారు. అప్పులు చేసి కుటంబాలను ఫోషించుకుంటున్నారన్నారు. ప్రస్తుతం వర్షాలకు తారురొడ్డు దిగితే బురదలో కూరుకుపోయి ప్రమాదాలకు గురవుతున్నారు.ఈ స్థితిలో మున్సిపల్ అధికారులు సైడు కాలువలు నిర్మించకుండా ఎవరికి వారు నిర్మించుకోవాలనడం పొదిలి పట్టణాభివృద్ధి పట్ల ప్రభుత్వ వైఖరికి అద్దం పడుతుందన్నారు. తక్షణమే యుద్ధ ప్రాతిపదికన మురుగు కాలువలు నిర్మించాలని, వీధి వ్యాపారులకు ప్రభుత్వం గుర్తింపు కార్డులు ఇచ్చి ఉపాధికి ప్రత్యామ్నాయం చూపించాలని,వ్యాపారం దెబ్బతినకుండా కాపాడాలని జరిగే ధర్నాలో పట్టణంలోని వ్యాపారులు, వీధి వ్యాపారులు, ప్రజలు 20వ తేది ధర్నాలో పాల్గొనాలని కోరారు.

## మాజీ ఎంపీ చింతామోహన్ సూళ్లూరుపేటలో పదేపదే కార్యక్రమాలు

### మీడియా సమావేశాలు ఏర్పాటు చేయడం సరియైన పద్ధతి కాదు

### సూళ్లూరుపేట నియోజకవర్గం కాంగ్రెస్‌పార్టీ ఇంచార్జ్ మావుదూరు వెంకటయ్య



(షణ్ముఖ వెలుగు, సూళ్లూరుపేట ఇంచార్జ్, నవంబర్ 18)

తిరుపతి పార్లమెంట్ మాజీ ఎంపీ చింతామోహన్ సూళ్లూరుపేటలో పదేపదే కార్యక్రమాలు ఏర్పాటు చేయడం మీడియా సమావేశాలు నిర్వహించడం సరియైన పద్ధతి కాదంటూ సూళ్లూరుపేట నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మావుదూరు వెంకటయ్య మీడియా సమావేశంలో విమర్శించారు. ఒకవేళ సమావేశాలు నిర్వహించాలని అనుకుంటే స్థానికంగా ఉన్న నాయకులను కార్యకర్తలను కలుపుకొని మీటింగ్లు గాని, సమావేశాలు చేసుకోవాలని మావుదూరు వెంకటయ్య తెలియజేశారు. మాజీ ఎంపీ చింతామోహన్‌ని ఏఐసీసీ సభ్యత్వం నుంచి కూడా అధిష్టానం తీసేసారని అన్నారు. అదే విధంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బద్దిపూడి రాజా రెడ్డి కూడా మీడియాతో మాట్లాడుతూ మాజీ ఎంపీ చింతామోహన్ సూళ్లూరుపేటలో పదేపదే మీడియా సమావేశాలు కార్యక్రమాలు ఏర్పాటు చేయడం సరైన పద్ధతి కాదంటూ, చింతా మోహన్ దుగరాజపట్నం లో వందల ఎకరాలు భూమిని కొనుగోలు చేసి అవి అమ్ముకోలేక ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, మాజీ ఎంపీ చింతామోహన్ ను విమర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## మార్కాపురం ప్రాంత పలకలు ఉండేలా చూడాలి

### అసెంబ్లీలో గళం వినిపించిన ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి



(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, నవంబర్ 18)

మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అసెంబ్లీలో మార్కాపురం పట్టణ ప్రాంతంలో కీలకమైన పలకల పరిశ్రమపై తన గళం వినిపించారు. ఈ సందర్భంగా అసెంబ్లీలో మాట్లాడుతూ ఒకప్పుడు మార్కాపురం ప్రాంతంలో దాదాపు 30000 నుండి 40000 మంది పూర్తిగా పలకల పరిశ్రమపై ఆధారపడి జీవించే వారిని, కానీ ఇప్పుడు 2 వేల నుండి 3 వేల మంది మాత్రమే ఈ పరిశ్రమపై ఆధారపడ్డారని అన్నారు. రాబోయే రోజుల్లో విద్యార్థులకు పంపిణీ చేసే కిట్లలో తప్పకుండా మార్కాపురం ప్రాంత పలకలు ఉండేట్లు చూడాలని, డిజైన్ స్లేట్లపై ప్రభుత్వం విధిస్తున్న 18% జీఎస్టీని 5% కు తగ్గించాలని ప్రభుత్వాన్ని కోరారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఘనంగా గ్రంథాలయ వారోత్సవాలు



(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, నవంబర్ 18)

మండల కేంద్రమైన ఉలవపాడు జీవీఎస్ఎమ్ ప్రభుత్వ జూనియర్ కళాశాల యందు సోమవారం ఘనంగా గ్రంథాలయ వారోత్సవాలు జరిగాయి. ఈ సందర్భంగా గ్రంథాలయం యొక్క ప్రాముఖ్యత ను ప్రిన్సిపాల్ గారపాటి గోపీ చంద్ ప్రకాష్, లైబ్రరీ సైన్స్ అధ్యాపకులు హనుమంతరావు విద్యార్థినీ, విద్యార్థులకు వివరించారు. అనంతరం కామర్స్ అధ్యాపకులు జ్యోతి, హిందీ అధ్యాపకులు రఫీ, బోటనీఅధ్యాపకులు గంగా భవాని, కెమిస్ట్రీ అధ్యాపకులు సుభాషిణి, జువాలజి అధ్యాపకులు వెంకటేశ్వర్లు, మ్యాథ్స్ అధ్యాపకులు మల్లికార్జున గ్రంథాలయాల విశిష్టతను విద్యార్థులకు వివరించారు. అనంతరం లైబ్రరీ సార్ విద్యార్థులకు క్విజ్ కండక్ట్ చేసారు. గెలుపొందిన టీమ్స్ కు ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో సర్టిఫికెట్స్ ఇవ్వటం జరిగింది.

## ఇట్టగుంట వెంకటరత్నయ్య ఆధ్వర్యంలో టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమం



(షణ్ముఖ వెలుగు, దొరవారిసత్రం, నవంబర్ 18)

తిరుపతి జిల్లా దొరవారి సత్రం మండలం కల్లూరు గ్రామ పంచాయతీలో మాజీ జెడ్పీటీసీ సభ్యుడు ఇట్టగుంట వెంకటరత్నయ్య సీనియర్ టీడీపీ నాయకుడు ఆధ్వర్యంలో టీడీపీ సభ్యుత్వ కార్యక్రమం జరిగింది. అధిక సంఖ్యలో పార్టీ సభ్యత్వం చేసుకొన్నారు. వీరితో పాటు తదితర టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## బంగారు బాల్యంకు గ్రామసభ





(షణ్ముఖ వెలుగు, కనిగిరి, నవంబర్ 18)

కనిగిరి మండలం చెర్లదిన్నె గ్రామంలో బంగారు బాల్యం అమలులో భాగంగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామ సభ ఏర్పాటు చేయడమైనది. ఈ సభలో బంగారు బాల్యం మిషన్ శక్తి కమిటీలను ఎంపికచేయడమైనది. ఈ సందర్భంగా ఐ సి డి ఎస్ సి డి పి ఓ సరోజినీ బంగారు బాల్యం పై అవగాహన కలిగించారు. అనంతరం బంగారు బాల్యం ప్రతిజ్ఞ చేశారు. అలాగే బంగారు బాలోత్సవాలు కార్యక్రమంలో భాగంగా వ్యాసరచన డిబేటింగ్ గ్రామస్థాయిలో గెలుపొందిన విద్యార్థులకు సోమవారం మండల స్థాయిలో బాల్య వివాహల రహిత ప్రకాశం పై,బాలల హక్కులపై, వ్యాసరచన,డిబేటింగ్ పోటీలు కనిగిరి పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల నందు నిర్వహించడం జరిగింది.గెలుపొందిన పిల్లలకు మంగళవారం డివిజన్ స్థాయిలో పోటీలు నిర్వహిస్తారని తెలిపారు.కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది, ఉపాధ్యాయులు, అంగన్వాడీ టీచర్స్, ఆశా కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## బావి ఆక్రమణకు గురైంది ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి

### సీమాంధ్ర మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి డిమాండ్



(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, నవంబర్ 18)

అనసముద్ర పేట మండలం, ఏ ఎస్ పేట గ్రామంలో సర్వే నెంబర్ 133లో సుమారు 120 అంకణములగల స్థలములో బావిని కబ్జా చేశారని సీమాంధ్ర మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి సోమవారం నాడు జిల్లా జాయింట్ కలెక్టర్కు వినతి పత్రం అందజేశారు. వివరాల్లోకి వెళితే గ్రామ వాస్తవులైన చండలూరు ప్రసాదరావు, చండలూరు రాజశేఖర్, చండలూరు వెంకటేశ్వర్లు, సూళ్లూరుపేటకు చెందిన ఒక వ్యక్తి అందరూ కలిసి హైదరాబాదుకు చెందిన ఒకరికి కోటి రూపాయల పైగా బావి స్థలాన్ని ఆక్రమించి అన్యాకృతం చేశారని వారు ఆరోపించారు.అంతేగాక ఈ స్థలాన్ని కూడా రిజిస్ట్రేషన్ చేశారని ఆరోపించారు. గతంలో ఈ గ్రామంలోని ఎస్సి, ఎస్టీల వారు ఈ బావుల్లో నీటిని అన్ని అవసరాలకు వాడుకుంటూ ఉండేవారు. సదరు బావిని పూడ్చివేసి చేసి, అక్రమార్చనకు పాల్పడి కోటి రూపాయలు సంపాదించిన వారిపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. గతంలో మాదిరిగానే సదరు గ్రామపంచాయతీ బావిని తిరిగి త్రవ్వించి, గ్రామ ప్రజలందరికీ ఉపయో గపడేలా చర్యలు తీసుకొని, సదర అక్రమ రిజిస్ట్రేషన్ రద్దు పరిచి వారి పైన చట్టపరియే చర్యలు తీసుకోవాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు పందిటి సుబ్బయ్య డిమాండ్ చేశారు.

## కనీస వేతనాలు చెల్లించాలి ఒప్పంద జీవోను విడుదల చేయాలి

### ఆశ వర్కర్ల డిమాండ్




(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, నవంబర్ 18)

కనీస వేతనం చెల్లించాలని, గతంలో ప్రభుత్వం ఒప్పందం చేసుకున్న జీవోను విడుదల చేయాలని ఆశ వర్కర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా కార్యక్రమానికి సిఐటియు మద్దతు ఇచ్చింది. తమకు కనీసం 20 వేలు వేతనం చెల్లించాలని, గతంలో ప్రభుత్వం ఒప్పందం చేసుకున్న జీవోలు అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా జాయింట్ కలెక్టర్కు వివిధ సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని సమర్పించారు. కార్యక్రమంలో జిల్లాలోని వివిధ మండలాల నుంచి హాజరైన ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో కులగణన చేసిన తర్వాత రిజర్వేషన్లు ప్రకటించాలి

### బీసీ నాయకుల డిమాండ్



(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, నవంబర్ 18)

రాష్ట్రంలో బీసీలకు సంబంధించి కులగణన చేసిన తర్వాత రిజర్వేషన్లు ప్రకటించాలని బీసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని జాయింట్ కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. బీసీ లందరికీ ఓబీసీ సర్టిఫికెట్లు ఇవ్వాలని వాళు డిమాండ్ చేశారు. జిల్లాలోని బీసీ హాస్టల్లో సౌకర్యాలు మెరుగుపరచాలన్నారు. మెడికల్ అలవెన్స్ కింద 50 రూపాయలు ఇవ్వాలని వాళ్ళు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా నెల్లూరు బీసీ సంక్షేమ సంఘం తరఫున పలువురు వివిధ సమస్యలతో జిల్లా జాయింట్ కలెక్టర్ కి వినతి పత్రం సమర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు శ్రీహర్రావు, సిహెచ్ మాల్యాద్రి, శైలజతో పాటు వివిధ బీసీ సంక్షేమ సంఘం నాయకులు పాల్గొన్నారు.

## బంగారు బాల్యాన్ని సంరక్షించాలి





(షణ్ముఖ వెలుగు, హనుమంతునిపాడు, నవంబర్ 18)

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బంగారు బాల్యం బాలోత్సవం భాగంగా సదా బాల సేవలో భాగంగా బంగారు బాల్యం విలువైనది అని బాలల ఉజ్వల భవిష్యత్తుకు పునాది అని అన్నారు. బాలల హక్కులు, బాలల సంరక్షణ సంక్షేమం, చట్టాలు పలు విషయాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పలు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో, తహసిల్దార్, ఎంఈఓ, హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

# వార్డుకో వారం కార్యక్రమంలో కమిషనర్ వెంకటేశ్వరరావు





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, నవంబర్ 18)

ఒంగోలు నగర సుందరీకరణకు సంబంధించి నగరంలో ప్రతిష్టాత్మకంగా 4, 19, 40వ డివిజన్‌లలో చేపట్టిన "వార్డు కో వారం" కార్యక్రమంలో ఒంగోలు నగర పాలక సంస్థ కమీషనర్ కె వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమీషనర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఈ నెల 18వ తేదీ నుంచి తేదీ 24.11.2024 వరకు 4, 19, 40వ డివిజన్‌లలో వార్డ్ కో వారం కార్యక్రమం చేప్పట్టడం జరిగింది అని తెలిపారు. ఇందులో భాగంగా ఈ వారం రోజులలో ప్రతి వార్డ్ కి ఇంజనీరింగ్. శానిటేషన్ , టౌన్ ప్లానింగ్ విభాగం వారితో టీం ఏర్పాటు చేసి వార్డ్ లో ముఖ్యంగా శానిటేషన్ మెరుగు పరుచుట , కాలువలో పూడిక తీత పనులు చేయుట, రోడ్ కి ఇరువైపులా గల పిచ్చి మొక్కలను తొలగించుట, అవసరమైన చోట కాలువలు, రోడ్లకు అంచనాలు తయారు చేయుట, వార్డ్ లో గల ఆక్రమణలు తొలగించుట మొదలగు పనులు చేప్పట్టి, వార్డులోని అన్ని సమస్యలు తెలుసుకొని వాటికీ పరిష్కారం చూపటం జరుగుతోంది అని తెలిపారు. ఇందులో భాగంగా, కమీషనర్ ఈ రోజు మొదటగా నగరంలోని 19 వ వార్డ్ లో పర్యటించారు. ప్రతి రోజు కూడా ఉదయం 7గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమయ్యేలా చూడాలని డీఈకి ఆదేశాలు ఇచ్చారు. కార్యక్రమం జరుగుతున్న ప్రతి చోట సంబంధిత డీఈ, ఏఈ, శానిటరీ ఇన్స్పెక్టర్ , సంబంధిత సచివాలయ సిబ్బంది



మొత్తం కూడా ప్రతిరోజు ఫీల్డ్‌లో ఉండి ఈ కార్యక్రమంలో తప్పనిసరిగా పాల్గొనాలని ఆదేశాలు ఇచ్చారు. భాగ్యనగర్‌లో 11వ అడ్డరోడ్డులో పర్యటించి అక్కడ ఉన్న కాలువలో పూడికను వెంటనే తీసివేయాలి అని శానిటరీ ఇన్స్పెక్టర్‌కి ఆదేశాలు ఇచ్చారు. అలానే రోడ్డుకు ఇరువైపులా పెరిగిన పిచ్చిమొక్కలు పీకివేయాలని ఆదేశాలు ఇచ్చారు. తప్పనిసరిగా యంత్రాల సాయంతో ఆయా పనులను నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని ఆదేశాలు ఇచ్చారు. ప్రతి రోజు కూడా అందరు ఆఫీసర్ కూడా పని ప్రారంభించే ముందర ఫోటో అలానే ఆ రోజు చివర పని పూర్తి చేసిన ఫోటోని తప్పనిసరిగా తమ ఛాంబర్ నందు ఇవ్వాలి అని ఆదేశాలు ఇచ్చారు. అనంతరం 4 వ డివిజన్‌లో ఇస్లాం పేట సచివాయల పరిధిలో పర్యటించారు. ఈ సందర్భంగా, డాన్ బోస్కో స్కూల్ నుంచి బాపూజీ కాంప్లెక్స్ వరకు నూతనంగా నిర్మించిన కాలువపైన ఆక్రమణలు వెంటనే తీసివేయాలి అని టౌన్ ప్లానింగ్ అధికారులకు సూచించారు. అలానే అక్కడ వర్షపు నీరు రోడ్ పై నిల్వ ఉండకుండా కాలువలోకి పోయే విధముగా చర్యలు తీసుకోవాలని ఇంజనీరింగ్ సిబ్బందికి ఆదేశాలు ఇచ్చారు.

ప్రతి రోజు కూడా అందరు సచివాలయ సిబ్బంది తమకు కేటాయించిన క్లస్టర్ లో పూర్తి బాధ్యత తీసుకొని ఆయా క్లస్టర్స్‌లో ప్రజలకు అవసరమైన శానిటేషన్, అవసరం ఐన చోట్లా నూతన కాలువలకు అంచనాలు, ఆక్రమణలు తొలగించుట, వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకొని అవి మొత్తం నిర్దేశించిన వారం లోపల పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని సచివాలయ సిబ్బందికి ఆదేశాలు ఇచ్చారు. ఈ రోజు కార్యక్రమంలో ఒంగోలు నగర పాలక సంస్థ కమీషనర్ తో పాటు, 19వ డివిజన్ టీడీపీ అధ్యక్షులు మారుతి రావు, కార్పొరేటర్ ఈదర వెంకట సురేష్ బాబు, 4 వ డివిజన్ టీడీపీ డివిజన్ అధ్యక్షులు , 4వ డివిజన్ కార్పొరేటర్ , ఎంఈ చంద్రయ్య , డీఈలు పద్మజ, ఇసాయ్య , ఏఈలు సౌజన్య, రాజశేఖర్ , టీపీవో బాబు రావు , మహా మనోహర్రెడ్డి , ఎస్ఎస్ పిచ్చయ్య , శానిటరీ ఇన్స్పెక్టర్లు ఆంజినేయులు , మిరియాల శ్రీను , సంబంధిత సచివాలయ సిబ్బంది, ఇతర నగర పాలక సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

## రిజిస్టరయిన భూమికి వేరొకరికి పట్టాదారు పాసుపుస్తకం మంజూరు

తడ ఎమ్మార్వో నిర్వాకం



(షణ్ముఖ వెలుగు, సూళ్లూరుపేట ఇంచార్జ్, నవంబర్ 18)

తిరుపతి జిల్లా గోపారెడ్డి పాలెం గ్రామంలో నివాసం ఉంటున్న ఎస్సీ కులానికి చెందిన తుమ్మ తిరుపాలు తండ్రి దేవయ్య మీద రిజిస్టర్ కాబడి, 1961 నుంచి సాగులో ఉన్న 60 సెంట్లు పొలమును సాగు చేసుకుంటూ జీవనం చేసుకుంటున్నారు. కానీ ఇటీవల కాలంలో తడ మండలం తహసీల్దార్ మాపై రిజిస్టర్ కాబడి అనుభవంలో వున్నా మా పొలమును వేరే వారికి దువ్వూరు ముని బాబు రెడ్డి అనువారికి పట్టాదారు పాసుపుస్తకం మంజూరు చేసి ఉన్నారు. వాళ్లు ఇప్పుడు వచ్చి ఇది మా పొలము అని మా పొలంలో అక్రమంగా ప్రవేశించడానికి ప్రయత్నం చేస్తున్నారని మా ఇరువురికి ప్రతినిత్యం గొడవలు జరుగుతున్నాయని, సూళ్లూరుపేట రెవెన్యూ డివిజనల్ అధికారికి అర్జీ రూపంలో తెలియజేశారు. ఒకరి ఆధీనంలో ఉంటూ సాగు చేసుకుంటున్నా రిజిస్టర్ పొలాన్ని వేరొక వాళ్లకు పట్టాదారు పాసుపుస్తకం ఇవ్వడం ఎంతవరకు సమంజసం అని తుమ్మ తిరుపాలు తమ ఆవేదం వ్యక్తం చేశాడు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి మాకు తగు న్యాయం చేయగలరని రెవెన్యూ డివిజనల్ అధికారికి తమ ఆవేదన తెలిపారు.

## దుగ్గరాజుపట్నంలో పోర్టు నిర్మించాలి

కాంగ్రెస్ పార్టీ తిరుపతి పార్లమెంట్ మాజీ ఎంపీ చింతామోహన్ సూళ్లూరుపేటలో నిరసన




(షణ్ముఖ వెలుగు, సూళ్లూరుపేట ఇంచార్జ్, నవంబర్ 18)

ఉమ్మడి నెల్లూరు జిల్లా దుగ్గరాజుపట్నంలో మరో పోర్టును నిర్మించాలంటూ తిరుపతి పార్లమెంటు కాంగ్రెస్ పార్టీ తిరుపతి పార్లమెంట్ మాజీ ఎంపీ చింతామోహన్ సూళ్లూరుపేటలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని అంబేద్కర్ విగ్రహం సమీపంలో మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేసి ఆయన మీడియాతో మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ తీసుకుని దుగరాజ పట్నంలో వెంటనే మరో నూతన పోర్టును నిర్మించాలని లక్షలాదిమంది నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలని, నిరుపేద రైతంగాన్ని అభివృద్ధిలో తీసుకురావాలని, అంతే కాకుండా లక్ష మంది నిరుద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై మాజీ ఎంపీ చింత మోహన్ మీడియా తో మాట్లాడారు, ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

## నేతల నాని బాబుకు 14 రోజుల జ్యూడిషియల్ రిమాండ్ విధించిన కనిగిరి కోర్టు

(షణ్ముఖ వెలుగు, కనిగిరి, నవంబర్ 18)

నేతల నాని బాబు తండ్రి రాంబాబు (31) (మాల) రాజోలు నియోజకవర్గం మల్కిపురం అను అతను సోషల్ మీడియాలో నారా చంద్రబాబు నాయుడు, నారా లోకేష్, నారా భువనేశ్వరులపై అసభ్యకర పోస్టులు పెట్టినందున ఈనెల 14వ తేదీ పామూరుకు చెందిన మోషే ఇచ్చిన ఫిర్యాదుతో క్రైమ్ నెంబర్ 162/2024 పామూరు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు కావడం జరిగింది. ఆదివారం సాయంత్రం రాజోలు పోలీసులు నాని బాబును అరెస్ట్ చేయడం జరిగింది. సోమవారం పామూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎం భీమా నాయక్, పామూరు సబ్ ఇన్స్పెక్టర్ టి.కిషోర్ కుమార్‌లు నాని బాబును కనిగిరి కోర్టులో హాజరపరచగా కనిగిరి జె ఎఫ్ సి ఎం జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కే భరత్ చంద్ర నిందితునికి 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించినట్లు కోర్టు వారు తెలిపారు.

## బంగారు బాల్యాన్ని సంరక్షించాలి

(షణ్ముఖ వెలుగు, మర్రిపూడి, నవంబర్ 18)

మండలంలోని కెల్లంపల్లి గ్రామ ఉన్నత పాఠశాలలో బంగారు బాల్యం బాలోత్సవం భాగంగా ముఖ్య అతిధిగా డిఎస్ఒ పాల్గొని గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేక అధికారి మాట్లాడుతూ సదా బాల సేవలో భాగంగా బంగారు బాల్యం విలువైనదని బాలల ఉజ్వల భవిష్యత్తుకు పునాదిఅని అన్నారు. బాలల హక్కులు,బాలల సంరక్షణ సంక్షేమం, చట్టాలు పలు విషయాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పలు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కెల్లంపల్లి గ్రామానికి ప్రత్యేక అధికారి ఏఒ, పంచాయతీ కార్యదర్శి, సచివాలయం సిబ్బంది, హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు విద్యార్థిని, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.




## గ్రంథాలయంలో విద్యార్థులకు క్విజ్ పోటీలు

(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, నవంబర్ 18)



మండల కేంద్రమైన ఉలవపాడు గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా సోమవారం పాఠశాల విద్యార్థులకు క్విజ్ పోటీ నిర్వహించారు. ఈ పోటీలలో మొత్తం 3 స్కూళ్ల విద్యార్థులు పాల్గొన్నారు.ఇందులో ప్రధమ స్థానంలో సెయింట్ జోసెఫ్ ఇంగ్లీష్ మీడియం స్కూలు మరియు రెండవ స్థానంలో శ్రీ సాయి ఒలంపియాడ్ స్కూల్ బహుమతులు గెలుచుకున్నారు.ఈ పోటీలకు పర్యవేక్షకులుగా ప్రభుత్వ పాఠశాల ఫిజిక్స్ టీచర్ ఆర్‌వీ ఫణిరాజు వ్యవహరించారు. విజేతలకు వారోత్సవాల ముగింపు వేడుకల్లో పుర ప్రముఖుల చేతుల మీదుగా బహుమతులు అందజేయబడును అని గ్రంథాలయ పాలకుడు డి .కోటేశ్వరరావు తెలిపారు.

## పొగాకుకు ప్రత్యామ్నాయ పంటల పై రైతులు దృష్టి సారించాలి

వ్యవసాయ అధికారి వెంకటేష్

(షణ్ముఖ వెలుగు, మర్రిపూడి, నవంబర్ 18)

మండలంలోని కెల్లంపల్లి, శివరాంపేట, కాకర్ల గ్రామాలలో పొగాకుకు ప్రత్యామ్నాయ పంటలపై శిక్షణా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వెంకటేష్ మాట్లాడుతూ రైతులు పొగాకును ఎక్కువగా సాగు చేయడం వలన గాలి, నీరు, భూమి కలుషితం అవుతున్నాయని, దీనివలన శ్వాసకోశ, క్యాన్సర్, గుండె జబ్బులు వ్యాధులతో పాటు అనేకమంది మత్తుకు బానిసలు అవడం జరుగుతుందని తెలిపారు. మానవాళికి ఇబ్బంది కలిగించే పొగాకు పంట సాగు తగ్గించాలని తెలిపారు. పొగాకు పంటకు రైతులు ప్రత్యామ్నాయ పంటలైన శనగ,మినుము, పెసర అలసంద వంటి అపరాల పంటలతో పంటమార్పిడి చేయడం వలన నేల సారం పెరిగి, భూమిలోని పోషకాల లభ్యత బాగుంటుందని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.



## జైపూర్‌లో పర్యటించిన ఎంపీ మాగుంట





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, నవంబర్ 18)

గృహ, పట్టణ వ్యవహారాల కమిటీ పర్యటనలో భాగంగా రాజస్థాన్ రాష్ట్రంలోని జైపూర్‌లో ఉప ముఖ్యమంత్రి దియా కుమారి ఏర్పాటు చేసిన తేనేటి విందులో ఎంపీ మాగుంట పాల్గొన్నారు. అనంతరం గృహ, పట్టణ వ్యవహారాల కమిటీ పర్యటనలో భాగంగా సోమవారం రాజస్థాన్ రాష్ట్రంలోని జైపూర్‌లోని మెట్రోను కమిటీ చైర్మన్ , ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి, ఇతర కమిటీ సభ్యులు సందర్శించారు.

## కంప్రెస్డ్ బయో గ్యాస్ పరిశ్రమల స్థాపనకు భూముల పరిశీలన



(షణ్ముఖ వెలుగు, హనుమంతునిపాడు, నవంబర్ 18)

మండల కేంద్రంలోని పలు గ్రామాలలో కంప్రెస్డ్ బయో గ్యాస్ పరిశ్రమల స్థాపన కోసం హనుమంతునిపాడు మండలం ముప్పాళ్ల పాడు, దాసల్లపల్లి, విరగారెడ్డి పల్లి గ్రామాలలో గల ప్రభుత్వ భూములను రిలయన్స్ కంపెనీ ప్రతినిధులు సోమవారం పరిశీలించారు. ముప్పాళ్లపాడు గ్రామంలో 280.56 ఎకరాలు దాసళ్ళపల్లి గ్రామంలో 196.56 సెంట్లు విరగారెడ్డి పల్లి గ్రామం లో116.76 సెంట్స్ భూములను తనిఖీ చేశారు.

## ఆటో మొబైల్ షాపులో చోరీ రూ.50 వేల నగదు, సీసీ కెమెరాలు అపహరణ

(షణ్ముఖ వెలుగు, పొదిలి, నవంబర్ 18)

స్థానిక విశ్వనాధపురంలోని మండల పరిషత్ కార్యాలయం ఎదురుగా గల ఓ ఆటోమొబైల్ షాపులో ఆదివారం అర్ధరాత్రి చోరీ జరిగింది. షాపు యజమానులు రాజేష్, రసూల్‌లు తెలిపిన వివరాల ప్రకారం ఆదివారం సాయంత్రం ప్రతి రోజు మాదిరిగానే షాపు మూసి ఇంటికి వెళ్ళామన్నారు. సోమవారం ఉదయం షాపు తెరిచి చూసేసరికి షాపులోని వస్తువులు చల్లా చదురుగా పడిఉండడం గమనించి క్యాష్ కౌంటర్ నందు నగదు చూసుకున్నారు. కౌంటర్‌లోని రూ.50 వేల నగదు చోరీకి గురైనట్లు సీసీ కెమెరాలు ధ్వంసం చేసినట్లు గమనించారు. వెంటనే విషయాన్ని పోలీసులకు తెలిపారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని క్లూస్ టీంను పిలిపించి వేలిముద్రలుసేకరించారు. పొదిలి ఎస్ఐ వి వేమన కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## వైసిపి అధినేత జగన్‌ని కలిసిన సోషల్ మీడియా కన్వీనర్



(షణ్ముఖ వెలుగు, పెద్దారవీడు, నవంబర్ 18)

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని తాడేపల్లిలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో మండల సోషల్ మీడియా కన్వీనర్ శొంఠి నాగార్జునరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. నాగార్జునరెడ్డి మాజీ సీఎం జగన్ మోహన్‌రెడ్డిని దుశ్శాలువాతో సత్కరించారు.


On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com